thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

భారత్ అఫ్ఘాన్ షెడ్యూల్ విడుదల



11

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 137| జగిత్యాల | బుధవారం 19 ఆగస్టు, 2026 ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## భారత్‌లో 100 కోట్ల మందికి ఓటరు గుర్తింపు కార్డులు

- ట్రంప్ పోస్ట్ నేపథ్యంలో ఈసీ కీలక ప్రకటన!
- దేశంలో దాదాపు 100 కోట్ల మంది ఓటర్లకు ఫొటో గుర్తింపు కార్డులు జారీ
- ఈసీ కీలక ప్రకటన- ఓటర్ ఐడీల ప్రాధాన్యతను వివరిస్తూ ట్రంప్ భారత్‌ను ఉదాహరణగా చూపడంతో వివరాల్ని వెల్లడించిన ఈసీ




## 26/11 నిందితులపై 'ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా'

- ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు ఎంతటి చర్యలకైనా సిద్ధమన్న కేంద్రం
- 26/11 ముంబయి దాడుల కేసులో పాకిస్థాన్‌కు చెందిన ఆరుగురు నిందితులపై ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా
- నిందితులు లేకున్నా విచారణ ప్రారంభం
- ఉగ్రవాదాన్ని తుదముట్టించడమే భారత లక్ష్యమని ఎంఈఏ స్పష్టం





## విద్యార్థుల మాట ప్రభుత్వం వినడం సంతోషకరంగా ఉంది

- ఇదే సరైన మార్గం: రాహుల్ గాంధీ
- విద్యార్థులు, ఝార్ఖండ్ ప్రభుత్వం మధ్య ఏకాభిప్రాయం కుదరడంపై రాహుల్ గాంధీ హర్షం
- విద్యార్థుల భవిష్యత్తుకు న్యాయం జరిగేలా దేశవ్యాప్తంగా వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందని వెల్లడి





## ఈసీ లక్షలాది ఓట్లను తొలగించింది

- మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపణ
- ఓటర్ల జాబితా నుంచి భారీగా ఓట్లు తొలగించారని ఆరోపణ
- సుమారు 73 లక్షల ఓట్లు తొలగించారన్న మహేశ్ కుమార్ గౌడ్
- బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని విమర్శ
- ఈసీని కేంద్రం పాకెట్ సంస్థగా మార్చిందంటూ వ్యాఖ్య

హైదరాబాద్

తెలంగాణలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం (ఈసీ) విచక్షణారహితంగా లక్షలాది ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ముసాయిదా ఓటరు జాబితా విడుదలైన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించలేదని, ఈ ఓట్ల తొలగింపు ప్రక్రియ వల్ల పేదలు, వలస కార్మికులే ఎక్కువగా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2002 నాటి ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకోవడం ఆచరణ సాధ్యం కాదని, పాత రికార్డులను - మిగతా3లో

# మళ్లీ వచ్చేది మనమే

- 117 సీట్లతో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డి ధీమా
- కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం
- అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి ఉండాలి సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం
- ట్యాంక్‌బండ్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు
- బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించిన సీఎం
- సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహం స్ఫూర్తి నింపేలా



హైదరాబాద్

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఏ ఒక్క కులానికో, మతానికో పరిమితం కాలేదని, బహుజనులను ఏకతాటిపైకి తెచ్చి గోల్కొండ కోటపై జెండా ఎగురవేశారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. ప్రజాపాలనను కాపాడుకోవాలని, మళ్లీ పాత దొరలు గద్దెనెక్కేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తెలంగాణ చరిత్రలోనే బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయ్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంత్రులు, గౌడ సంఘాల నేతల - మిగతా3లో

## విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణలో జాప్యం వద్దు

- విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేయాల్సిందేనన్న కాక్రోచ్ జనతా పార్టీ
- కోర్టు అడిగిన ఎఫ్ఐఆర్‌ల జాబితాను ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్న
- విద్యార్థులకు సంబంధించిన అసలు సమస్య ఆందోళనల్లో పాల్గొన్నందుకు నమోదైన కేసులను రద్దు చేయడమే

# మధ్యవర్తులను ఆశ్రయించొద్దు



- 22ఏ భూములు విషయంలో కట్టు కథలు నమ్మొద్దు, దళారులను ఆశ్రయించొద్దు : సీఎం రేవంత్
- 22ఏ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ల అంశంపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- ప్రజల ఆస్తి పరిరక్షణకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని వెల్లడి
- ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపడతాం

హైదరాబాద్

ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆస్తులు కలిగిన వారు రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపడతామని చెప్పారు. 22ఏ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ల అంశంపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు సమీక్ష నిర్వహించారు. రిజిస్ట్రేషన్ల కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ తీసుకొన్న వారి ఆస్తులు 22-ఏ జాబితాలో ఉంటే, రెవెన్యూ అధికారులు రెండు రోజుల్లో పరిశీలించి, అది ప్రైవేటు భూమి అయితే రిజిస్ట్రేషన్ వెంటనే చేస్తారని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు 22-ఏ జాబితా భూములను క్షుణ్ణంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి సరైన జాబితాను రూపొందిస్తారని తెలిపారు. అందులో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని, ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ భూ హక్కుల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రైవేటు భూములకు సంబంధించి ఒక్క అంగుళం భూమికి కూడా ఇబ్బంది రానివ్వమని స్పష్టం చేశారు. 22-ఏ భూముల విషయంలో దళారులు, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని సూచించారు. ఎలాంటి పుకార్లు, కట్టు కథలను విశ్వసించవద్దని కోరారు.

**తప్పును సరిదిద్దుతున్నాం : పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

ఇది పేదల ప్రభుత్వం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పేదల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన ఇందిరమ్మ - మిగతా3లో

## 2027 అసెంబ్లీ ఎన్నికల వేళ యూపీ, పంజాబ్, గుజరాత్‌కు బీజేపీ ఇన్‌ఛార్జ్‌లు

- పంజాబ్ బాధ్యతలు సతీశ్ పూనియాకు
- గుజరాత్ ఇన్‌ఛార్జ్‌గా తరుణ్ చుగ్
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ కీలక నియామకాలు



## రైతుల అవసరాలకు అనుగుణంగా ఉద్యాన పరిశోధనలు

- పరిశోధన ఫలితాలు రైతుల చెంతకు చేరేలా ఆధునిక సాంకేతికతను వినియోగించాలి
- చిన్న, సన్నకారు రైతులే లక్ష్యంగా పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలి
- రాష్ట్రంలో కూరగాయల ఉత్పత్తి పెంపునకు ప్రత్యేక కార్యాచరణ అవసరం
- మూడు నాలుగేళ్లలో తెలంగాణలో 10 లక్షల ఎకరాలకు ఆయిల్‌పామ్ విస్తరణ లక్ష్యం
- శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన కళాశాల ప్రాంగణంలో హార్టికల్చరల్ రీసెర్చ్ కాంప్లెక్స్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి తుమ్మల



హైదరాబాద్

రైతుల అవసరాలకు అనుగుణంగా ఉద్యాన పరిశోధనలు జరగాలని, శాస్త్రవేత్తలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాల్లో జరుగుతున్న పరిశోధనల ఫలితాలు రైతుల చెంతకు చేరేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన కళాశాల ప్రాంగణంలో హార్టికల్చరల్ రీసెర్చ్ కాంప్లెక్స్ కు మంత్రి శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యాన రంగానికి కొత్త దిశను చూపే చారిత్రాత్మక ఘట్టంగా - మిగతా3లో

# భారత్‌లో 100 కోట్ల మందికి ఓటరు గుర్తింపు కార్డులు

భారతదేశంలో దాదాపు 100 కోట్ల మంది అర్హులైన ఓటర్లకు ప్రత్యేక ఎలక్టోరల్ ఫొటో ఐడెంటిటీ కార్డులు జారీ చేసినట్లు ఎన్నికల సంఘం అధికారులు మంగళవారం తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్కడ ఓటింగ్ సంస్కరణల కోసం భారతదేశ ఓటర్ ఐడీల విధానాన్ని ఉదాహరణగా ప్రస్తావించిన నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం ఈ కీలక వివరాల్ని వెల్లడించింది. భారతదేశంలో ప్రతి ఓటరూ కచ్చితంగా ఫొటో గుర్తింపు కార్డు ఆధారంగానే ఓటు వేస్తారని అధికారులు నొక్కి చెప్పారు. ఓటర్లు తమ వ-జూ×జ ను కూడా ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అమెరికాలో ఓటర్ల అక్రమాలను అరికట్టేందుకు, పౌరసత్వ ధ్రువీకరణను తప్పనిసరి చేసే సేవ్ (సేఫ్‌గార్డ్ అమెరికన్ ఓటర్ ఎలిజిబులిటీ – నాూఎజు) అమెరికా యాక్ట్‌కు మద్దతుగా ట్రంప్ సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. ఇటీవల జరిగిన భారత సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల గుర్తింపు విధానం ఎంతో పటిష్టంగా ఉందని ట్రంప్ కొనియాడారు. ఈ క్రమంలోనే అమెరికా ఎన్నికల్లో కూడా ఓటర్లకు ఫొటో ఐడీ కార్డులను తప్పనిసరి చేయాలని ఆయన గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

### ట్రంప్ ఏం పోస్ట్ చేశారంటే?

కొద్ది రోజుల కిందట భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్? కుమార్ అమెరికా ఎన్నికల వ్యవస్థపై ప్రశ్నించారు. భారత్‌లో మాదిరిగా ఓటు వేసేందుకు చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు కార్డు (వాలిడ్ ఫొటో ఐడీ) లేకుండా అమెరికాలో ఎన్నికలు ఎలా నిర్వహించగలుగుతున్నారని అడిగారు. దీనిపై తాజాగా ట్రంప్ స్పందిస్తూ ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. 'ఈ నెల ప్రారంభంలో భారత చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్? కుమార్ మన అధికార యంత్రాంగాన్ని ఒక ప్రశ్న అడిగారు. చెల్లుబాటు అయ్యే ఫొటో ఐడీ లేకుండా అమెరికాలో ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. భారత్‌లో జరిగిన గత సార్వత్రిక ఎన్నికల్లో ఏకంగా గీ4.గీ కోట్ల మంది ఓటర్లు పాల్గొనగా, వారిలో పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించిన వారు ఒక శాతం కంటే తక్కువే. ప్రతి ఒక్క ఓటరు దగ్గర కచ్చితంగా ప్రభుత్వ ఫొటో ఐడీ కార్డు ఉంది' అని ట్రంప్ ప్రశంసించారు.




### అత్యంత పారదర్శకంగా భారత ఎన్నికల వ్యవస్థ: ఈసీ

ఈ సందర్భంగానే భారత ఎన్నికల కమిషన్ అధికారులు తమ నిష్పాక్షికమైన ఎన్నికల నిర్వహణ తీరును వివరించారు. ఈసీ ప్రకారం– దేశవ్యాప్తంగా ఉన్న 12 లక్షల పోలింగ్ స్టేషన్లకు గానూ ప్రభుత్వ ఉద్యోగులైన బూత్ లెవెల్ అధికారులు (దీూా) ఓటర్ల జాబితాల్ని సిద్ధం చేస్తారు. వీటిని రాజకీయ పార్టీలు నియమించిన బూత్ లెవెల్ ఏజెంట్లు (దీూా) నిరంతరం ఆడిట్ చేస్తారు. పోలింగ్ రోజున అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్లు ఓటింగ్ కేంద్రాల్లో ఉండి ప్రక్రియను పర్యవేక్షిస్తారు. అలానే ఓట్ల లెక్కింపు సమయంలో కూడా కౌంటింగ్ ఏజెంట్లు ప్రత్యక్షంగా హాజరై ఓటింగ్, కౌంటింగ్ పారదర్శకతను నిర్ధరిస్తారు. ఫిజికల్ కార్డుల్ని ఓటర్లకు అందించడంతో పాటు డిజిటల్ రూపంలో కూడా తమ ఓటరు ఐడీని ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కూడా ఉంది.

అమెరికాలో సేవ్ అమెరికా యాక్ట్‌కు మద్దతు కూడగట్టే ప్రయత్నంలో భాగంగానే ట్రంప్ తాజాగా భారత ఎన్నికల వ్యవస్థను ప్రస్తావిస్తూ ఈ పోస్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చట్టం ద్వారా ఓటరు నమోదు సమయంలో సదరు పౌరులు పౌరసత్వానికి సంబంధించిన ఆధారాలు సమర్పించడం, దేశవ్యాప్తంగా ఓటర్ ఐడీ అవసరాన్ని తీసుకురావడం, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై పరిమితులు విధించడం వంటి ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందులో భాగంగానే తన వాదనలకు బలం చేకూర్చేందుకు, భారత్‌ను ఉదాహరణగా చూయిస్తూ సేవ్ అమెరికా యాక్ట్‌ను ఆమోదించుకోవాలని ట్రంప్ చూస్తున్నారు. ఈ క్రమంలోనే యూఎస్ ఎన్నికల్లో కఠిన నిబంధనలు అమలు చేయాలని ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అసలైన అమెరికన్ పౌరులే ఎన్నికల్లో ఓటేసేలా చూడటమే దీని ఉద్దేశమని చెబుతున్నారు.

# 26/11 నిందితులపై 'ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా'

ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు, ఉగ్రదాడుల వెనుక ఉన్న నిందితుల్ని చట్టం ముందు నిలబెట్టేందుకు భారతదేశం 'ఎంతటి చర్యలకైనా వెనుకాడదు' కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూూ) స్పష్టం చేసింది. 2008 నాటి 2గీ/11 ముంబయి ఉగ్రదాడి కేసులో పాకిస్థాన్‌లో దాక్కున్న ఆరుగురు ప్రధాన నిందితులపై ముంబై పోలీసులు 'ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా' ప్రక్రియను ప్రారంభించిన నేపథ్యంలోనే ఎంఈఏ ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు కోర్టుకు హాజరుకాకపోయినా విచారణ జరిపే విధానాన్నే ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా అంటారు. దీనిపైనే మాట్లాడిన భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్– సరిహద్దు ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న జీరో టాలరెన్స్ విధానాన్ని పునరుద్ఘాటించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గబోమని, ఎలాంటి చర్యలైనా తీసుకుంటామని జైస్వాల్ స్పష్టం చేశారు. ఉగ్రవాదం వల్ల భారత్ తీవ్రంగా నష్టపోయిందని, ఉగ్రవాద చర్యలు ఎంత తీవ్రమైనవో అంతర్జాతీయ సమాజం గుర్తించాలనే తాము కోరుతున్నట్లు తెలిపారు. ఉగ్రవాదాన్ని, ముఖ్యంగా సరిహద్దు బయట జరిగే ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాల్ని ఏకం చేసేందుకు భారత్ నిరంతరం శ్రమిస్తోందని, ఈ పోరాటంలో ఏమాత్రం వెనక్కి తగ్గబోదని జైస్వాల్ వెల్లడించారు.

### హఫీజ్ సయీద్ సహా నిందితులు వీరే

2గీ/11 కేసులో పాకిస్థాన్‌కు చెందిన ఆరుగురు నిందితులపై ముంబయి పోలీసులు ట్రయల్ ఇన్ ఆబ్సెంటియాకు (గైర్హాజరీలో విచారణ) సంబంధించిన ప్రక్రియను ప్రారంభించారు. వీరిలో లష్కరే తోయిబా (నాజు) వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్, సీనియర్ ఆపరేటివ్ జకీ–




ఉర్– రెహ్మాన్ లఖ్వీ, సాజిద్ మీర్, అబు అల్కామా, అసిమ్ అలియాస్ అబు కహాఫా, మేజర్ అబ్దుర్ రెహ్మాన్ పాషా ఉన్నారు. ఈ నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్న నేపథ్యంలో ముంబయి పోలీసులు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ నిగమ్‌కు లేఖ రాసి తదుపరి ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. ఇలాంటి ఉగ్రవాద కేసులో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (దీచీచీూ), 2003లోని సెక్షన్ 35గీ కింద ట్రయల్ ఇన్ ఆబ్సెంటియాకు సంబంధించిన నిబంధనల్ని తొలిసారి వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉజ్వల్ నిగమ్ ప్రకారం– పరారీలోని నిందితులు కోర్టుకు హాజరుకాకపోయినా వారిపై విచారణ కొనసాగించేందుకు సెక్షన్ 35గీ అవకాశం కల్పిస్తుంది. న్యాయ ప్రక్రియలో అనవసర జాప్యాన్ని నివారించడమే దీని ఉద్దేశమని ఆయన తెలిపారు. ఇక 2008 నవంబర్ 2గీన పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ఉగ్రవాదులు ముంబయి నగరంపై భీకర దాడులు చేశారు. ఈ ఘటనలో 1గీ0 మందికిపైగా పౌరులు ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది గాయపడ్డారు. ఈ దాడులకు ప్రణాళిక రూపొందించడం, సహకరించడం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌లో దాక్కున్న నిందితులపై చర్యలు తీసుకోవాలని భారత్ పదేపదే కోరుతూ వచ్చింది. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు 14 రాష్ట్రాల్లో భారత భద్రతా దళాలు నిర్వహించిన విస్తృత ఆపరేషన్లలో పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతు ఉన్న షాజాద్ భట్టి ఉగ్రవాద నెట్‌వర్క్‌ను నిర్వీర్యం చేశాయి. ఈ దాడుల్లో 253 మందిని అదుపులోకి తీసుకోగా, 80కిపైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 200 కుపైగా ఆపరేటర్లను అరెస్ట్ చేసినట్లు భద్రతా సంస్థలు వెల్లడించాయి. ఇక ఈ కుట్రలతో తమకు సంబంధం లేదని పాకిస్థాన్ చేస్తున్న ప్రకటనల్ని విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. షాజాద్ భట్టీ నెట్‌వర్క్‌కు ఐఎస్ఐతో సంబంధం ఉందని భారత్ వాదిస్తుండగా పాకిస్థాన్ దీనిని తిరస్కరించింది. దీనిపై మాట్లాడిన జైస్వాల్, భారత ప్రభుత్వం ఇప్పటికే దీనిపై తమ వైఖరిని వెల్లడించిందని, దానికే కట్టుబడి ఉంటుందని తెలిపారు.

### జమ్మూలో నాజు కమాండర్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్

ఇక పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ఆపరేషనల్ కమాండర్ మహ్మద్ యాకూబ్‌పై జమ్మూలోని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడిన కేసులో పరారీలో ఉన్న నిందితుడిపై ఈ వారెంట్ జారీ చేసినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. ఈ యాకూబ్‌ను అబు సుమామా, సుమామా ఇల్యాస్, వారిస్ అలీ అనే పేర్లు కూడా ఉన్నాయని వెల్లడించారు. యాకూబ్ ఇస్లామాబాద్‌లోని చట్టా బఖ్తావర్ ప్రాంతం నుంచి లష్కరే తోయిబా కార్యకలాపాల్ని నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

# విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణలో జాప్యం వద్దు

విద్యార్థుల ఆందోళనకు సంబంధించిన కేసులో విషయంలో దిల్లీ ప్రభుత్వం జాప్యం చేయొద్దని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) డిమాండ్ చేసింది. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయాలని తెలిపింది. కోర్టు ఆదేశాల మేరకు కొట్టివేయాల్సిన ఎఫ్ఐఆర్‌ల జాబితాను ప్రభుత్వం వెంటనే సమర్పించాలని సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ డిమాండ్ చేశారు.

కోర్టు ఎఫ్ఐఆర్‌ల వివరాలను కోరుతున్నప్పుడు ప్రభుత్వం వాటిని సమర్పించడంలో ఎందుకు వెనుకాడుతోందని దాస్ ప్రశ్నించారు. ఈ వ్యవహారాన్ని మరింత ఆలస్యం చేసే ప్రయత్నాలను అంగీకరించబోమని స్పష్టం చేశారు. విద్యార్థులకు సంబంధించిన అసలు సమస్య ఆందోళనల్లో పాల్గొన్నందుకు నమోదైన కేసులను రద్దు చేయడమేనని అన్నారు. ప్రభుత్వం ఇతర నేర కేసులపై చర్యలు తీసుకోవాలనుకుంటే అది వేరే అంశమని పేర్కొన్నారు. సుమారు 2,800 మంది తీవ్ర నేరాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించినట్లు ప్రభుత్వం చెబుతోందని అన్నారు. వారిపై చర్యలు తీసుకోవడాన్ని విద్యార్థుల కేసులతో ముడిపెట్టడం సరికాదని స్పష్టం చేశారు. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులు భవిష్యత్తులోనూ చట్టపరమైన సమస్యలు ఎదుర్కోకుండా చూడాలని సీజేపీ కోరుతోంది. కేసులను కేవలం క్లోజ్ చేసినట్లు చూపడం కాకుండా, విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను అధికారికంగా ఉపసంహరించుకోవాలని పార్టీ డిమాండ్ చేస్తోంది.

### దర్యాప్తు జరిపేందుకు హైపవర్డ్ కమిటీ

మరోవైపు నిరసనకారులపై పోలీసు చర్యకు వ్యతిరేకంగా కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టాలని దాఖలపైన పిటిషన్?పై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. నిరసనల సందర్భంగా వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు హైపవర్డ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నాట్లు పేర్కొంది. ఆ రోజు జరిగిన మార్చ్ ఫుటేజీని కమిటీ పరిశీలిస్తుందని తెలిపింది. అలాగే మహిళా ఆందోళనకారుల్ని లక్ష్యంగా చేసుకున్నారంటూ వచ్చిన ఆరోపణలపై కూడా దర్యాప్తు జరుగుతుందని వెల్లడించింది. ఈ ప్యానెల్‌లో మాజీ న్యాయమూర్తులు, సీబీఐ మాజీ డైరెక్టర్, రాష్ట్ర మాజీ డీజీపీ సభ్యులుగా ఉంటారని చెప్పింది. నిరసనకారులపై పోలీసు చర్యకు వ్యతిరేకంగా కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టాలని దాఖలైన పిరిష పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే.

### ఆరోపణలను ఖండించిన దిల్లీ పోలీసులు

అయితే తమపై వచ్చిన ఆరోపణలను సుప్రీంకోర్టులో దిల్లీ పోలీసులు ఖండించారు. జులై 20న సీజేపీ నిర్వహించిన మార్చ్‌లో నిరసనకారులు బారికేడ్లను బద్దలుకొట్టి, పార్లమెంటు వైపు దూసుకెళ్లే ప్రయత్నం చేయడం వల్లే హింస చెలరేగిందని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సచిన్ శర్మ ఈ వివరాలు వెల్లడించారు. సుమారు 3 కిలోమీటర్ల పరిధిలో 30,000 మందికి పైగా నిరసనకారులు గుమికూడగా వారిని నియంత్రించేందుకు 5,000 మంది పోలీసులను మోహరించినట్లు డీసీపీ తెలిపారు. పరిస్థితి అదుపు తప్పడంతోనే పోలీసుల జోక్యం అనివార్యమైందని ఈ ఘర్షణల్లో ఇరువైపులా గాయాలయ్యాయని పేర్కొన్నారు. పోలీసుల చర్యలు చట్టబద్ధంగానే ఉన్నాయని ఎలాంటి అక్రమ లేదా అనవసర బలప్రయోగం జరగలేదని అఫిడవిట్‌లో స్పష్టం చేశారు. విద్యార్థుల ఆందోళనలో భాగంగా జులై 20న సీజేపీ ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్ నిర్వహించారు. పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు, ఇతర ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. దిల్లీలో ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటి ముందుకు వెళ్లేందుకు కొందరు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించడంతో పాటు లాఠీచార్జ్ చేశారు. పోలీసుల చర్యలకు సంబంధించిన పలు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. నిరసనకారులపై పోలీసులు దురుసుగా వ్యవహరించారని కొన్ని వర్గాలు ఆరోపించాయి. అయితే పోలీసు శాఖ తన చర్యలను సమర్థించుకుంది.




## విద్యార్థుల మాట ప్రభుత్వం వినడం సంతోషకరంగా ఉంది

ఝార్ఖండ్ ప్రభుత్వం, విద్యార్థుల మధ్య చర్చలు సఫలం కావడం పట్ల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ చర్చల మార్గాన్ని ఎంచుకోవడం, విద్యార్థులు సంయమనం పాటించి తమ డిమాండ్లను ఆమోదించేలా చేసుకోవడం సరైన విధానమని ప్రశంసించారు. విద్యార్థులను వెనక్కి లాగడానికి బదులుగా వారిని ముందుకు నడిపించే వ్యవస్థను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తానని రాహుల్? గాంధీ హామీ ఇచ్చారు.

"ఝార్ఖండ్ విద్యార్థులు– రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. విద్యార్థులు తమ నిరాహార దీక్షను విరమించారు. ఈ వార్త వినడం సంతోషాన్ని ఇచ్చింది. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఝార్ఖండ్ ప్రభుత్వం చర్చల మార్గాన్ని ఎంచుకుని పరిష్కారాన్ని కనుగొన్నారు. విద్యార్థులు సంయమనం పాటించి తమ డిమాండ్లను ఆమోదించేలా చేసుకున్నారు. ఇదే సరైన మార్గం. విద్యార్థులు ప్రశ్నలు అడిగినప్పుడు వారికి సమాధానాలు లభించాలి. మేము దేశంలోని ప్రతి విద్యార్థికి అండగా ఉంటాము. ప్రతి విద్యార్థికి వారి కష్టానికి తగిన ప్రతిఫలం, న్యాయమైన పోటీలో పాల్గొనేలా ఈ వ్యవస్థను పూర్తిగా మారుస్తాం" అని రాహుల్ గాంధీ తెలిపారు.

### జేఎస్ఎస్‌సీ–సీజీఎల్ పరీక్ష రద్దు

విద్యార్థుల డిమాండ్ల నేపథ్యంలో ఝార్ఖండ్ ప్రభుత్వం జేఎస్ఎస్‌సీ–సీజీఎల్ పరీక్షను రద్దు చేయాలని నిర్ణయించింది. అలాగే టీడీపీఎల్ సంస్థ నిర్వహించిన పరీక్షలు, వెలువడిన ఫలితాలు, ఆ ప్రక్రియ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన చర్యలన్నింటినీ రద్దు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. 2014 నుంచి రాష్ట్రంలో నిర్వహించిన వివిధ నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణకు కూడా ప్రభుత్వం ఆదేశించింది. అలాగే రాంచీలోని సదర్ ఆసుపత్రిలో విద్యార్థి నేత దేవేంద్రనాథ్ మహతో నిరాహార దీక్ష విరమించారు. రాష్ట్ర మంత్రులు దీపికా పాండే సింగ్, ఇర్ఫాన్ అన్సారీ సమక్షంలో ఆయన దీక్షను ముగించారు. రాష్ట్రంలో నియామక పరీక్షల నిర్వహణ, పారదర్శకత, అవకతవకలపై విద్యార్థులు చాలాకాలంగా ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో మహతో నిరాహార దీక్షకు దిగారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కీలక నిర్ణయాలు ప్రకటించడంతో ప్రభుత్వం–విద్యార్థుల మధ్య చర్చలు కొలిక్కి వచ్చాయి.

### జేపీఎస్‌సీ పరీక్షలపైనా విచారణ

ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్‌సీ) సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో అవకతవకల ఆరోపణలపైనా సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు సీఎం హేమంత్ సోరెన్ ప్రకటించారు. ఈ దర్యాప్తును రిటైర్డ్ న్యాయమూర్తి పర్యవేక్షణలో నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఎస్ఐటీ, సీఐడీ ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నాయని, విచారణలో పలు దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయని సోరెన్ తెలిపారు. జేపీఎస్‌సీ ద్వారా నియమితులైన కొందరిని పరీక్షల్లో అక్రమాలకు సంబంధించిన కేసుల్లో అరెస్టు చేసినట్లు కూడా పేర్కొన్నారు. యువత ప్రధానంగా జేపీఎస్‌సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలపై స్పష్టత కోరుతోందని సోరెన్ తెలిపారు. ఈ అంశంపై ఇప్పటికే ప్రభుత్వం తరఫున ఓ మంత్రి దర్యాప్తు జరుగుతోందని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం చెప్పిందే సరైనదిగా అనిపిస్తుందని, మరికొన్ని సందర్భాల్లో విద్యార్థుల వాదనలో నిజం కనిపిస్తుందని అన్నారు. రెండు వైపుల వాదనల్లో వాస్తవాన్ని తేల్చేందుకు సమగ్ర విచారణ అవసరమని సీఎం పేర్కొన్నారు.

### పరీక్ష రద్దుతో కొత్తగా మరో ఆందోళన

ఒకవైపు విద్యార్థుల ఆందోళనకు పరిష్కారం లభించినప్పటికీ, మరోవైపు జేఎస్ఎస్‌సీ–సీజీఎల్ ద్వారా ఇప్పటికే నియమితులైన ఉద్యోగులు కొత్త సమస్యను ఎదుర్కొంటున్నారు. పరీక్ష రద్దు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పలువురు ఉద్యోగులు రాంచీలోని ప్రాజెక్ట్ భవన్ వద్ద ఆందోళనకు దిగారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గొడుగులు పట్టుకుని, తాత్కాలిక టార్పాలిన్ కింద నిలబడి నిరసన తెలిపారు. పోటీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, అధికారికంగా నియామక ఉత్తర్వులు పొందిన తర్వాత మొత్తం ప్రక్రియను రద్దు చేయడం తమను అన్యాయంగా శిక్షించడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఉద్యోగ హోదాపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని, పరీక్ష రద్దు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు.

## 2027 అసెంబ్లీ ఎన్నికల వేళ యూపీ, పంజాబ్, గుజరాత్‌కు బీజేపీ ఇన్‌ఛార్జులు

వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ ఇప్పటి నుంచి వ్యూహాలను పదును పెడుతోంది. ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ మంగళవారం ఆయా రాష్ట్రాలకు ఇన్‌ఛార్జులు, కో–ఇన్‌ఛార్జులను నియమించారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ వెల్లడించింది. ఈ మేరకు బీజేపీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఉత్తర్‌ప్రదేశ్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా రాజ్యసభ ఎంపీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డేను నియమించారు. కో–ఇన్‌ఛార్జ్‌గా జాతీయ కార్యదర్శి జగదీశ్ ఈశ్వర్‌భాయ్ పటేల్‌కు బాధ్యతలు అప్పగించారు. దేశ రాజకీయాల్లో కీలక రాష్ట్రంగా ఉన్న యూపీలో 2027 అసెంబ్లీ ఎన్నికల నేథ్యంలో సంస్థాగత వ్యవహారాలు, పార్టీ శ్రేణుల సమన్వయం, ఎన్నికల వ్యూహంపై తావ్డే బృందం దృష్టి పెట్టనుంది. ఇక పంజాబ్ రాష్ట్ర భాజపా ఇన్‌చార్జ్‌గా జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ సతీశ్ పూనియాను నియమించారు. అలాగే గుజరాత్ బాధ్యతలను రాజ్యసభ సభ్యుడు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యాలయ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్‌కు అప్పగించారు. ఇతర రాష్ట్రాలకు ఇన్‌చార్జ్‌ల నియామకాలను త్వరలో చేపడతామని బీజేపీ తెలిపింది. అప్పటివరకు ఆయా రాష్ట్రాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభారీ వ్యవస్థ యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేసింది.

### కొత్త టీమ్‌తో ఎన్నికల వ్యూహం

ఇదిలా ఉండగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కొత్త టీమ్‌ను సోమవారం ప్రకటించారు. అనుభవజ్ఞులతో పాటు యువ నాయకులకు ప్రాధాన్యం కల్పిస్తూ కొత్త బృందాన్ని రూపొందించారు. జాతీయ ప్రధాన కార్యదర్శులుగా మాజీ అమేఠీ ఎంపీ స్మృతి ఇరానీ, మాజీ త్రిపుర ముఖ్యమంత్రి బిప్లబ్ కుమార్ దేబ్, సునీల్ బన్సల్, వినోద్ తావ్డే, గజేంద్ర పటేల్, సతీశ్ పూనియా, హరీశ్ ద్వివేది, సంజయ్ భాటియాలకు కీలక బాధ్యతలు అప్పగించారు. అదే సమయంలో పలువురు సీనియర్ నేతలను జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించారు. మాజీ రాజస్థాన్ సీఎం వసుంధరా రాజే, మాజీ ఉత్తరాఖండ్ సీఎం తీరథ్ సింగ్ రావత్, రామ్ మాధవ్, బైజయంత్ పాండా, డీ పురందేశ్వరి తదితరులకు ఈ జాబితాలో చోటు దక్కింది. మొత్తం 13 మంది కొత్త ఉపాధ్యక్షుల్లో ఆరుగురు మహిళలు ఉండటం విశేషం.

### విస్తృత ప్రాతినిధ్యంతో జాతీయ కార్యదర్శులు

జాతీయ కార్యదర్శుల నియామకాల్లోనూ దేశవ్యాప్తంగా భౌగోళిక ప్రాతినిధ్యానికి బీజేపీ ప్రాధాన్యం ఇచ్చింది. మధ్యప్రదేశ్‌కు చెందిన కవితా పటిదార్, కేరళకు చెందిన కె. సురేంద్రన్, యూపీకి చెందిన డాక్టర్ భోలా సింగ్, ఝార్ఖండ్‌కు చెందిన ప్రదీప్ వర్మ, గుజరాత్‌కు చెందిన జగదీశ్ పటేల్, దిల్లీకి చెందిన సందీప్ పాఠక్ తదితరులకు జాతీయ కార్యదర్శులుగా బాధ్యతలు అప్పగించారు. నాగాలాండ్‌కు చెందిన ఫాంగ్నోన్ కొన్యాక్, కేరళకు చెందిన అనిల్ ఆంటోనీ, తమిళనాడుకు చెందిన ఎం. వెంకటేశన్, పశ్చిమ్ బెంగాల్‌కు చెందిన మనోజ్ తిగ్గా, బిహార్‌కు చెందిన సిద్ధార్థ్ శంభు, దిల్లీకి చెందిన స్వదేశ్ సింగ్, అసోంకు చెందిన మృగాంక దేవ్ బర్మన్, గుజరాత్‌కు చెందిన రోహన్ గుప్తా, దిల్లీకి చెందిన జై ప్రకాశ్ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు.

### కీలక విభాగాలకూ కొత్త బాధ్యతలు

కేంద్ర ఆర్థిక వ్యవహారాల్లో కీలకమైన జాతీయ కోశాధికారి బాధ్యతలను పీయూశ్ గోయల్‌కు మరోసారి అప్పగించారు. తరుణ్ చుగ్‌ను బీజేపీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జ్‌గా నియమించారు. గుజరాత్‌కు చెందిన ఎంపీ హేమాంగ్ జోషికి యువ మోర్చా బాధ్యతలు ఇచ్చారు. మహిళా మోర్చా అధ్యక్ష బాధ్యతలను ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రూప్ కుమారి చౌధరి చేపట్టనున్నారు. పార్టీ మీడియా విభాగంలో మాత్రం కొనసాగింపునకు ప్రాధాన్యం ఇచ్చారు. లోక్‌సభ సభ్యుడు అనిల్ బలూనీ మీడియా కన్వీనర్‌గా కొనసాగనున్నారు. ఆయనకు సహ కన్వీనర్లుగా ఆశిష్ ఉషా అగర్వాల్, ప్రదీప్ భండారీ, సిద్ధార్థ్ యాదవ్ వ్యవహరించనున్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దీపక్ మ్హాస్కేకు సోషల్ మీడియా కన్వీనర్ బాధ్యతలు అప్పగించారు.

చురకలు



# రైతుల అవసరాలకు అనుగుణంగా ఉద్యాన పరిశోధనలు

-మొదటిపేజీ తరువాయి

ఈ పరిశోధనా సముదాయం నిలుస్తుందని అన్నారు. ఇప్పటివరకు విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు, ప్రయోగశాలల్లో ఎన్నో విలువైన పరిశోధనలు జరిగినప్పటికీ వాటి ఫలితాలు రైతులకు ఆశించిన స్థాయిలో చేరడం లేదని మంత్రి అన్నారు. గతంలో పరిశోధన ఫలితాలను రైతులకు చేరవేయడానికి రేడియో, టెలివిజన్ వంటి పరిమిత మార్గాలు ఉండేవని, ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియా, యూట్యూబ్ వంటి శక్తివంతమైన మాధ్యమాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పరిశోధనల ఫలితాలను వీడియోలు, షార్ట్ ఫిల్మ్‌లు, సోషల్ మీడియా ద్వారా రైతులకు చేరేలా శాస్త్రవేత్తలు, విశ్వవిద్యాలయాలు, ఉద్యాన శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర వ్యవసాయ భూమిలో ఉద్యాన పంటలు సుమారు గీ శాతం మాత్రమే ఉన్నప్పటికీ, వ్యవసాయ స్థూల విలువలో వాటి వాటా 2గీ శాతం, సుమారు రూ.30,34గీ కోట్లుగా ఉందని తెలిపారు. ఉద్యాన రంగం రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నందున పరిశోధన, సాంకేతికత, విస్తరణ సేవలకు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో కూరగాయల ఉత్పత్తిలో సుమారు 70 శాతం లోటు ఉందని, ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండటం ఆందోళనకరమని మంత్రి అన్నారు. రాష్ట్రంలోనే డిమాండ్ ఉన్న కూరగాయలు, ఉద్యాన పంటలను పండించేలా ప్రతి జిల్లా, మండల కేంద్రాల్లో డెమాన్‌స్ట్రేషన్ ప్లాట్లను ఏర్పాటు చేయాలని కోరారు. రైతులు ప్రత్యక్షంగా పంటలను, దిగుబడులను, ఆదాయ అవకాశాలను చూసి నేర్చుకునేలా ఫీల్డ్ డెమాన్‌స్ట్రేషన్లు నిర్వహిస్తే ఉద్యాన పంటల విస్తీర్ణం, ఉత్పాదకత గణనీయంగా పెరుగుతుందని చెప్పారు. చిన్న, సన్నకారు రైతుల అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు జరగాలని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సుమారు 70 లక్షల మంది రైతుల్లో దాదాపు 90 శాతం మంది చిన్న రైతులేనని, రెండు మూడు ఎకరాల భూమి కలిగిన రైతులు ఖరీదైన యంత్రాలు లేదా భారీ పెట్టుబడులతో కూడిన సాంకేతికతను స్వయంగా స్వీకరించలేరని అన్నారు. అందువల్ల తక్కువ ఖర్చుతో, చిన్న కమతాల్లో అమలు చేయగల సాంకేతికత, యంత్రాలు, సాగు పద్ధతులపై పరిశోధనలు జరగాలని సూచించారు. రైతుల జీవితాల్లో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారాలు చూపేలా గ్రామీణ యువతలో ఉన్న సృజనాత్మకతను కూడా ప్రోత్సహించాలని మంత్రి అన్నారు. వ్యవసాయ కుటుంబాలకు చెందిన యువత తమ తల్లిదండ్రుల కష్టాలను తగ్గించేందుకు స్వయంగా యంత్రాలు, పరికరాలను రూపొందిస్తున్నారని, ఇలాంటి ఆవిష్కరణలను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఇప్పటికే ఆయిల్‌పామ్ సాగు విస్తరణలో దేశంలోనే ముందంజలో ఉందని మంత్రి తెలిపారు. రానున్న మూడు నాలుగు సంవత్సరాల్లో రాష్ట్రంలో ఆయిల్‌పామ్ విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు తీసుకెళ్లే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఆయిల్‌పామ్‌తో పాటు కోకో, జాపత్రి తదితర అంతర పంటల ద్వారా రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు



కల్పించవచ్చని అన్నారు. రైతులు ప్రత్యక్షంగా చూసి నేర్చుకునేలా ఈ పద్ధతులను పరిశోధనా కేంద్రాలు, డెమాన్‌స్ట్రేషన్ ఫారాల్లో ప్రదర్శించాలని సూచించారు. ఉద్యాన పరిశోధనలను కేవలం ప్రయోగశాలలకే పరిమితం చేయకుండా రైతుల పొలాల్లోకి తీసుకెళ్లాలని మంత్రి అన్నారు. కూరగాయలు, పూలు, ద్రాక్ష, ఔషధ, సుగంధ పంటలపై పరిశోధనలను ఒకే గొడుగు కింద సమన్వయం చేసేందుకు హార్టికల్చరల్ రీసెర్చ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం కీలకమైన ముందడుగు అని తెలిపారు. ఉద్యాన పంటల్లో ఉత్పత్తి పెంచడంతో పాటు పంట అనంతర నష్టాలను తగ్గించడంపైనా పరిశోధనలు అవసరమని మంత్రి చెప్పారు. పంట చేతికొచ్చే సమయంలో ధరలు పడిపోవడం లేదా ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్టపోకుండా పంట అనంతర నిర్వహణ వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు అధికంగా రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండా శాస్త్రీయ సూచనల మేరకు సమతుల్య ఎరువుల వినియోగం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించేలా పరిశోధనా సంస్థలు, వ్యవసాయ శాఖ అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. పంటల్లో రసాయన అవశేషాలను తగ్గించి నాణ్యమైన ఉత్పత్తులను అందించగలిగితే దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్లలో కూడా తెలంగాణ పంటలకు మరింత డిమాండ్ ఏర్పడుతుందని అన్నారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే ఆధునిక సాగు పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలని మంత్రి అన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగు విధానాలు భవిష్యత్ వ్యవసాయానికి ఎంతో అవసరమని, తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించే పద్ధతులను పరిశోధించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలు కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాల్లో కూడా తమ కార్యకలాపాలను విస్తరించాలని మంత్రి కోరారు. ప్రభుత్వానికి చెందిన సీడ్ ఫారాలు, ఇతర అందుబాటులో ఉన్న భూములను వినియోగించుకొని జిల్లాల వారీగా పరిశోధన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. రైతులు తమ ప్రాంతంలోనే కొత్త పంటలు, ఆధునిక సాగు పద్ధతులను ప్రత్యక్షంగా చూసి స్వీకరించే అవకాశం కల్పించాలని అన్నారు.

వ్యవసాయమే భవిష్యత్తు అని మంత్రి పేర్కొన్నారు. కరోనా సమయంలో అన్ని రంగాలు దాదాపు నిలిచిపోయినా రైతు వ్యవసాయాన్ని మాత్రం ఆపలేదని గుర్తుచేశారు. భవిష్యత్ తరాలకు వ్యవసాయాన్ని మరింత ఆకర్షణీయమైన, లాభదాయకమైన వృత్తిగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, పట్టు పరిశ్రమ తదితర అనుబంధ రంగాలన్నీ రైతు కేంద్రంగా పనిచేయాలని, రైతు కష్టాన్ని ఎలా తగ్గించాలి, ఆదాయాన్ని ఎలా పెంచాలి అనే దృక్పథంతో పరిశోధనలు, విధానాలు రూపొందించాలని పిలుపునిచ్చారు.

రైతులకు నాణ్యమైన విత్తనాల సమస్యను పరిష్కరించేందుకు విత్తన ప్రాసెసింగ్ యూనిట్, మహిళా రైతులు, గ్రామీణ యువతకు శిక్షణతో పాటు కొత్త వ్యాపార అవకాశాలను కల్పించేందుకు మష్రూమ్ ఉత్పత్తి యూనిట్ వంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు.

ప్రతి మూడు సంవత్సరాలకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని పరిశోధనా ఫలితాలను క్షేత్రస్థాయిలో అమలు చేసే విధంగా యూనివర్సిటీ, పరిశోధనా కేంద్రాలు, వ్యవసాయ?ఉద్యాన శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి సూచించారు.

# సంక్షేమ పథకాలపై క్రెడిట్ వార్

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో ప్రచార ఆధిపత్యం సరికొత్త మలుపు తిరిగింది. సంక్షేమ పథకాల క్రెడిట్ ఎవరిదనే అంశంపై అధికార కాంగ్రెస్, విపక్ష బీజేపీ మధ్య మొదలైన వాగ్వాదం ఇప్పుడు 'ఫోటోల వార్'గా మారింది. సంక్షేమ పథకాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఫోటో ముద్రించాలని బీజేపీ పట్టుబడుతుండగా, కేంద్ర పథకాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటో ఎందుకు పెట్టకూడదని కాంగ్రెస్ ఎదురుదాడికి దిగిందితెలంగాణలో కొత్తగా జారీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫోటోను పక్కనపెట్టి సీఎం, మంత్రుల ఫోటోలు ఎలా ముద్రిస్తారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు.తెలంగాణలో 57 లక్షల రేషన్ కార్డుల ద్వారా దాదాపు 2 కోట్ల మంది ప్రజలకు కేంద్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం అందిస్తోందని, అలాంటప్పుడు ఆ పథకానికి సంబంధించిన కార్డులపై మోదీ చిత్రం ఎందుకు ఉండకూడదని నిలదీశారు. గత 12 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం రూ.13 లక్షల కోట్లు ఖర్చు చేసిందని, అదనంగా బుల్లెట్ రైన్ కారిడార్ కోసం మరో రూ.1.5 లక్షల కోట్లు వెచ్చించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. పంచాయతీల అభివృద్ధికి కేంద్రం నిధులిస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాటకాలాడుతూ క్రెడిట్ కొట్టేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను విస్మరిస్తూ '22ఏ నిషేధిత భూముల జాబితా' పేరిట గత రెండేళ్లుగా దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు.బండి సంజయ్ వ్యాఖ్యలకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ నుంచి పన్నుల రూపంలో కేంద్రానికి భారీగా ఆదాయం వెళ్తోందని స్పష్టం చేశారు. జీఎస్టీతో పాటు ఇతర మార్గాల ద్వారా రాష్ట్రం నుంచి కేంద్ర ప్రభుత్వానికి భారీ మొత్తంలో పన్నుల రాబడి అందుతోందని, అందువల్ల



రాష్ట్రంలో అమలయ్యే కేంద్ర పథకాలన్నింటిపై సీఎం రేవంత్ రెడ్డి ఫోటో పెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రానికి రాష్ట్రం చెల్లిస్తున్న పన్నులు ఎంత? తిరిగి కేంద్రం నుంచి రాష్ట్రానికి కేటాయిస్తున్న నిధులు ఎంత? అనే అంశంపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో బలంగా ఉందని, తుమ్మితే ఊడిపోయే ప్రభుత్వం ఎవరిదో బండి సంజయ్ తెలుసుకోవాలని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పోటీకి నిలబడే సత్తా బీజేపీకి ఉందా అని ప్రశ్నించారు.తెలంగాణలో మొదలైన ఈ వివాదం కేవలం ఒక ఫోటోకు సంబంధించినది మాత్రమే కాదు.. సంక్షేమ పథకాల అమలులో ఓటర్లను ఆకట్టుకునేందుకు జరుగుతున్న రాజకీయ పోరాటం. ఉచిత బియ్యం కేటాయింపులు తమవేనని కేంద్రం చెబుతుంటే, రాష్ట్రానికి రావాల్సిన న్యాయబద్ధమైన నిధులను ప్రస్తావిస్తూ ఫెడరల్ హక్కుల కార్డును కాంగ్రెస్ ముందుకు తెస్తోంది. కార్డులపై, పోస్టర్లపై ఫోటోల ప్రాధాన్యత ఎవరు దక్కించుకుంటారనే అంశం రాబోయే రోజుల్లో ఇరు పార్టీల మధ్య మరింత రాజకీయ వేడిని పెంచే అవకాశం ఉంది.

## డిజిటల్ ఓ వైపు... ఫీల్డ్ లో మరో వైపు

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయ యుద్ధం ప్రస్తుతం రెండు పారలర్ ఫీల్డ్స్‌లో జరుగుతోంది. ఒకవైపు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను, సోషల్ మీడియా సామ్రాజ్యాన్ని బీఆర్ఎస్ ముట్టడిస్తుంటే.. మరోవైపు క్షేత్రస్థాయి మాస్ రాజకీయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ తన గుప్పిట్లో ఉంచుకుంటోంది. ఈ రెండు ఫీల్డుల్లో తమకు బలం ఉన్న ఫీల్డుల్లోనే రెండు పార్టీలు పోరాటాలు చేస్తున్నాయి కానీ మరో ఫీల్డులోకి వెళ్లేందుకు ఆసక్తి చూపించడం లేదు.కేటీఆర్ నిర్వహించే విలేకరుల సమావేశాలు మినహా బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష ఆందోళనలకు దూరంగా ఉంటున్నప్పటికీ, సోషల్ మీడియా వేదికగా విపరీతమైన కంటెంట్‌తో సంచలనం సృష్టిస్తోంది. యూట్యూబ్ ఛానళ్లు, ట్విట్టర్ , ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్స్ , ఇన్ఫ్లుయెన్సర్ల నెట్‌వర్క్ ద్వారా డిజిటల్ నెట్‌వర్క్‌ను సద్వినియోగం చేసుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరంతరం వ్యతిరేకతను ప్రచారం చేయడంలో బీఆర్ఎస్ శ్రేణులు ముందంజలో ఉన్నాయి.దీనికి పూర్తి భిన్నంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహం సాగుతోంది. డిజిటల్ స్పేస్ కంటే ప్రజల మధ్య ప్రత్యక్షంగా ఉండే సభలకే ఆయన ప్రాధాన్యతనిస్తున్నారు. వారంలో రెండు మూడు బహిరంగ సభలు లేదా ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొంటూ నేరుగా ప్రజా బాహుళ్యంలోకి వెళ్తున్నారు. రేవంత్ ప్రసంగాలు కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా, పొలిటికల్ మాస్ డైలాగ్‌లు, వైరల్ స్టేట్‌మెంట్లతో బీఆర్ఎస్‌ను ఎండగట్టేలా ఉంటున్నాయి.

## మళ్లీ వచ్చేది మనమే

-మొదటిపేజీ తరువాయి

సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. గౌడ, యాదవ, ముదిరాజ్, దళిత వర్గాలను ప్రోత్సహించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలుస్తామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అర్హులైన నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం నిత్యం స్ఫూర్తి నింపేలా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న గౌడ్ విగ్రహానికి ఉండాలన్నారు. 2029లో మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమావ్యక్తం చేశారు. నేత, గీత కార్మికులకు పింఛన్ ఇవ్వాలని ఆదేశించామన్నారు. ప్రభుత్వ పొలాలు ఎక్కడున్నా ఈత, తాటిచెట్లు పెంచాలని రేవంత్ రెడ్డి సూచించారు. వాటిని పెంచితే కల్తీ లేని కల్లు వస్తుందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, కాలువ గట్ల వెంబడి నాటాలన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం

కులవృత్తులను గౌరవిస్తూనే పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ చదివించాలని తల్లిదండ్రులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కుటుంబ న్యాయం మాత్రమే జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని సీఎం తెలిపారు. బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్న కేటీఆర్, హరీశ్?రావు ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. రాష్ట్టంలో కరవు రావాలని కోరుకుంటూ అఘోరాలతో చేతబడులు చేయించారని ఆరోపించారు. పాత దొరల పాలన మళ్లీ రావడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని ప్రజలను కోరారు. "ప్రజాపాలనలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు ఉన్నాయి. సర్వాయి పాపన్న విగ్రహం పెట్టాలని గీత కార్మికులు కోరారు. సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటు స్థలాన్ని నేనే సూచించాను. ఇక్కడ టూరిజం కార్యాలయం ఉండేది. విగ్రహం కోసం ఖాళీ చేయించా. ట్యాంక్‌బండ్‌కు ఎవరొచ్చినా, సర్వాయి పాపన్న విగ్రహం కనపడేలా స్థలం ఎంపిక చేశాను. దేశవిదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు కనపడేలా విగ్రహం ఏర్పాటు చేశాం. బహుజనుల నుంచే పుట్టుకొచ్చిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్'

### మరోసారి అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్‌నే

గత బీఆర్ఎస్ పాలనపై సీఎం రేవంత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'నాడు గొర్రెలు, బర్రెలు, చేపలు పంపిణీ చేసి రాజ్యం వాళ్లు ఏలుతూ, మనల్ని కుల వృత్తులకే పరిమితం చేయాలని చూశారు' అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సీఎం అయితే ఆయన కొడుకు కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్, అల్లుడు హరీశ్ రావు మంత్రి అయ్యారని.. అదే రేవంత్ సీఎం అయితే బీసీ నేత మహేశ్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్, సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనుమరాలికి కీలక పదవులు ఇచ్చి ఉద్యమకారులను గౌరవించామని తెలిపారు. రాబోయే డీలిమిటేషన్ తర్వాత 117 సీట్లతో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## మధ్యవర్తులను ఆశ్రయించొద్దు

-మొదటిపేజీ తరువాయి



ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ పేదవాడికి అన్యాయం చేయదని . పేదవాడి న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళం కూడా ఈ ప్రభుత్వం తీసుకోదని వారి హక్కులు, ఆస్తులకు సంపూర్ణ రక్షణ కల్పిస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మంత్రిమాట్లాడారు. 22ఏ నిషేధిత జాబితా వల్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మరోమారు స్పష్టం చేస్తూ సమస్య పరిష్కార ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని 24 గంటల్లోనే మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4 మొత్తం 34 రిజిస్ట్రేషన్లు జరిగాయని మంత్రి గారు వివరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 22ఏ నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేసే క్రమంలో క్షేత్రస్థాయిలో జరిగిన పొరపాట్లను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సరిదిద్దుతోందని తెలిపారు.

బాధ్యతాయుతమైన ప్రభుత్వంగా పొరపాటును పారదర్శకంగా అంగీకరించి . అదే సమయంలో జరిగిన తప్పును సరిదిద్దే బాధ్యతను కూడా తీసుకున్నామని ప్రజలను ఇబ్బందుల్లో వదిలేసే ప్రభుత్వం తమది కాదని స్పష్టం చేశారు. వివిధ జీవోలు, మెమోల ద్వారా గత ప్రభుత్వాల కాలంలో క్రమబద్ధీకరించబడిన ప్రైవేట్ భూములు, హైకోర్టు మరియు జీహెచ్‌ఎంసీ/హెచ్‌ఎండీఏ అనుమతులు పొందిన స్థలాలు ఆన్‌లైన్ అప్‌లోడింగ్‌లో సాంకేతిక లోపం కారణంగా 22ఏ జాబితాలోకి వచ్చాయని మంత్రి వివరించారు.ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే గుర్తించిందని, బాధితులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పునరుద్ధరించామని తెలిపారు.

22ఏ సమస్యల త్వరిత పరిష్కారం కోసం రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీ, ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, రాబోయే 15 రోజుల పాటు ఈ కమిటీ రోజువారీగా దరఖాస్తులను పరిశీలించి . జెన్యూన్ ప్రైవేట్ ఆస్తులన్నింటినీ తక్షణమే క్లియర్ చేసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పుడు పేదవాడి సమస్యను రాజకీయంగా వాడుకోవడం మానేయండి. ఇది పేదల ప్రభుత్వం.. పేదల ఆశీస్సులతో వచ్చిన ఇందిరమ్మ ప్రభుత్వం. పేదవాడి న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళం కూడా అన్యాయం జరగనివ్వం. మేం తప్పును ఒప్పుకుని దిద్దుతున్నాం.. మీరు చేసిన తప్పులను ఒప్పుకునే ధైర్యం మీకుందా?" అని ప్రశ్నించారు. అబద్ధాలు, ఆరోపణలు, రాజకీయ ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరని అన్నారు. తప్పు జరిగితే దాన్ని అధికారుల మీదకు నెట్టేసి చేతులు దులుపుకోవడం తమ ప్రభుత్వ విధానం కాదని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే పొరపాటును అంగీకరించామన్నారు

## ఈసీ లక్షలాది ఓట్లను తొలగించింది



-మొదటిపేజీ తరువాయి

సాకుగా చూపుతూ పౌరుల ఓటు హక్కును నిరాకరించడం సరైన పద్ధతి కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఎలాంటి పక్కా కారణాలు లేకుండా సుమారు 73 లక్షల ఓట్లను తొలగించారని, మరో 92 లక్షల ఓట్లను అనుమానిత జాబితాలో చేర్చారని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజన, పోలింగ్ కేంద్రాల మార్పుల వల్ల తలెత్తిన సాంకేతిక సమస్యలు ఈ గందరగోళానికి కారణమయ్యాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీల తరహాలోనే ఎన్నికల సంఘాన్ని కూడా తన 'పాకెట్ సంస్థ'గా మార్చుకుందని ఆయన తీవ్రంగా విమర్శించారు.

## సంపాదకీయం

# ఐదేళ్లలో దశాబ్దాల అభివృద్ధి

దేశ ప్రధాని నరేంద్ర మోడీ జాతిని ప్రధానంగా సప్త ధార గురించి ప్రస్తావించారు. గతాని కంటే భిన్నంగా ఈసారి మోడీ తక్కువ సమయం మాట్లాడినప్పటికీ.. అసలైన విషయాల గురించి ప్రస్తావించారు. గతంలో కరోనా సమయంలో దేశ ప్రధాని ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించారు. అంతకుముందు మేకింగ్ ఇండియా కార్యక్రమాన్ని అమలులోకు తీసుకొచ్చారుగతంలో కరోనా సమయంలో దేశ ప్రధాని ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించారు. అంతకుముందు మేకింగ్ ఇండియా కార్యక్రమాన్ని అమలులోకు తీసుకొచ్చారు. ఇప్పుడు ఏకంగా సప్త ధారను ప్రకటించారు. దీని ప్రకారం భారత దేశంలో తయారీ పరిశ్రమ వేగవంతం కానుందిని నరేంద్ర మోడీ ప్రకటించారు. తయారీ రంగం.. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ రంగం.. ఏఐ డీప్ టెక్.. డిఫెన్స్.. కనెక్టివిటీ.. గ్రీన్ బ్లూ ఎకానమీ విస్తరణ.. సాఫ్ట్ పవర్ సెక్టార్ల మీద ప్రధానంగా దృష్టి సారించబోతున్నట్లు ప్రకటించారు. గ్లోబల్ కాంపిటీషన్ తట్టుకునే విధంగా భారతదేశానికి ఈ పాలసీ అత్యంత కీలకమవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.చైనా తయారీ రంగంలో.. అమెరికా ఏఐ డీప్ టెక్ లో.. ఇజ్రాయిల్ డిఫెన్స్ లో.. రష్యా కనెక్టివిటీలో.. యూరప్ దేశాలు గ్రీన్ బ్లూ ఎకానమిలో అద్భుతాలు సాధిస్తున్నాయి. అయితే ఈ రంగాలు మొత్తం భారతదేశంలో అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంది. ఎందుకంటే ప్రపంచంలోనే అత్యధిక జనాభా భారత దేశంలో ఉంది. పైగా యువశక్తి కూడా ఈ దేశానికి ప్రధాన బలం. అందువల్లే ఈ స్థాయిలో భారత్ ఈ రంగాల మీద దృష్టి పెట్టింది.సప్త ధారలో భాగంగా దశాబ్దాలుగా సాధించాలని అభివృద్ధిని దీని ద్వారా కేవలం ఐదు నుంచి ఏడు సంవత్సరాల లోనే చేసి చూపించవచ్చని నరేంద్ర మోడీ చెబుతున్నారు. ప్రకృతి, తీర ప్రాంతాల వనరుల మీద పెట్టుబడులు పెట్టడం ద్వారా గ్రీన్ బ్లూ ఎకానమీ ని డెవలప్ చేయడానికి ఆస్కారం ఉంటుంది. సాఫ్ట్ పవర్ లో భాగంగా.. భారతదేశ సంస్కృతిని.. సంప్రదాయాలను.. యోగ.. ఆయుర్వేదం.. యునాని వంటి వైద్య విధాలను విస్తరించి.. భారత బ్రాండ్ మొత్తాన్ని ప్రపంచానికి చాటి చెప్పవచ్చు. తయారీ రంగం.. వ్యవసాయం.. టెక్నాలజీ.. రోడ్ల అనుసంధానం.. డిఫెన్స్ వంటి రంగాలలో భారీగా ఉపాధి అవకాశాలు.. పెట్టుబడులు పెట్టడం ద్వారా.. ఎక్కువ అభివృద్ధి సాధించడానికి ఆస్కారం ఉంటుంది. ఎందుకంటే ఈ రంగాలలో భారతదేశంలో విపరీతమైన అవకాశాలు ఉన్నాయి. పైగా వీటి ఎగుమతులను ఇతర దేశాలకు పంపించడానికి ఆస్కారం ఉంది. అందువల్లే సప్త ధారలో నరేంద్ర మోడీ ఈ రంగాలను పదే పదే ప్రస్తావించారు. భవిష్యత్తు కాలంలో వీటి ఆధారంగానే ప్రపంచ మనుగడ సాగుతుంది. అందువల్లే వీటి మీద నరేంద్ర మోడీ దృష్టిపెట్టి.. తన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు.ప్రపంచం మొత్తం ప్రస్తుతం టెక్నాలజీలో దూసుకుపోతోంది. టెక్నాలజీ రంగంలో పెట్టుబడులు పెట్టిన దేశాలు పండగ చేసుకుంటున్నాయి. టెక్నాలజీ ముందుకు నడవాలంటే ఖచ్చితంగా సెమీ కండక్టర్లు ఇప్పుడు చాలా అవసరం. సెమీ కండక్టర్లకు సంబంధించి ప్రపంచ అవసరాలను తైవాన్ తీరుస్తోంది. దక్షిణ కొరియాకు కూడా ఇందులో భాగముంది. అయితే ఇప్పుడు సెమీ కండక్టర్ల తయారీలో భారత్ కూడా ప్రగతిని సాధిస్తుంది. వచ్చే రోజుల్లో సొంతంగా వీటిని తయారు చేసుకోవాలని నిర్ణయించుకుంది. అందువల్ల నరేంద్ర మోడీ తన సప్త ధార కార్యక్రమంలో టెక్నాలజీకి పెద్దపీట వేశారు. ఇక సముద్ర తీర ప్రాంతాలలో పర్యటకానికి ఎక్కువగా ఆస్కారం ఉంటుంది.మాల్దీవులు వంటి దేశం ఆర్థికంగా ఒకప్పుడు బలంగా ఉందంటే దానికి ప్రధాన కారణం తీర ప్రాంత పర్యాటకమే. మనదేశంలో తీర ప్రాంత రాష్ట్రాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. వాటిలో ఇప్పటికీ అనుకున్న స్థాయిలో టూరిజం అభివృద్ధి కాలేదు. ఆ ప్రాంతాలలో పెట్టుబడులు పెట్టి.. టూరిజం డెవలప్ చేస్తే అవకాశాలు పెరుగుతాయి. విదేశీ మారకద్రవ్యం కూడా అధికంగా వస్తుంది. ఈసారి ప్రసంగంలో పాకిస్తాన్ పేరును ప్రధాని మోదీ ఒక్కసారి కూడా ప్రస్తావించలేదు. ఇక చైనా ప్రస్తావన కూడా తీసుకురాలేదు. మన సరిహద్దు ఉగ్రవాదం, సీమాంతర ఉగ్రవాదం గురించి మాట్లాడలేదు. కశ్మీర్ అంశం లేకుండా జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం 1998 తర్వాత ఇదే అని చెప్పుకోవచ్చు. ఇది యాదృచ్ఛికం కాదు. పొరుగు దేశాలు తమ పరిధిలోనే ఉన్నాయని, దుస్సాహసానికి అవకాశం లేదని పరోక్షంగా ప్రపంచానికి తెలియజేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్తాన్‌పై ప్రభావం, చైనా వైపు కూడా జాగ్రత్తగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సరిహద్దు ఉగ్రవాదం గణనీయంగా తగ్గిందని, కశ్మీర్ ప్రశాంతంగా ఉందని మోదీ పరోక్షంగా కశ్మీర్, సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రస్తావిచలేదు.ఇక మోదీ ప్రసంగానికి విరుద్ధంగా ఉంది పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రసంగం. పాకిస్తాన్ వైపు నుంచి రా, పీవోకే అల్లర్లు, బలూచిస్తాన్ దాడులు, సింధూ జలాలపై నిందలు భారత్‌పై వేస్తున్నారు. భారత నామస్మరణ లేకుండా పాకిస్తాన్ నేతలు మాట్లాడడం లేదు. భారత్ మాత్రం ఆ దేశం పేరు కూడా ఎత్తకుండా ఉండటం మన నమ్మకానికి నిదర్శనం. ఎదురుపక్షం ఎంత మాట్లాడినా, భారత్ ఆ విషయాలను పట్టించుకోవడం లేదనే సందేశం అగ్నివీర్‌లను ఈ ప్రక్రియలో ఉపయోగించుకునే అవకాశం ఉందని అనుకోవచ్చు. సైన్యంలో శిక్షణ, క్రమశిక్షణ పొంది గ్రామాలకు తిరిగి వచ్చిన వారు సివిల్ డిఫెన్స్‌లో కీలక పాత్ర పోషించగలరు. ఇజ్రాయెల్ తరహాలో సివిలియన్ స్థాయిలో భద్రతా సామర్థ్యం పెంచుకునే దిశగా అడుగులు పడుతున్నాయని చెప్పవచ్చు.రాబోయే ఐదు నుంచి ఏడు ఏళ్లలో గత 50 ఏళ్లలో చేయనంత అభివృద్ధి సాధించాలని ప్రధాని పిలుపునిచ్చారు. సైన్యం, ఆయుధాల తయారీపై కూడా ప్రస్తావన ఉంది. అయితే బాహ్య ముప్పుల కంటే అంతర్గత భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇది పరిస్థితులు మారాయని, భారత్ తన శక్తిని అంతర్గతంగా, ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసుకోవాలని సూచించే వ్యూహాత్మక మార్పు. పొరుగు దేశాలను పట్టించుకోకుండా ఉండటం అంటే వాటిని పూర్తిగా విస్మరించడం కాదు. వాటి ప్రభావం తగ్గిందని, ఇప్పుడు దృష్టి లోపలికి మళ్లించాలని చెప్పే తీరు. అదే సమయంలో కొత్త రకం ముప్పులకు సిద్ధం కావాలని హెచ్చరిక కూడా.మొత్తంగా చూస్తే, 202గీ ఎర్రకోట ప్రసంగం కేవలం వేడుక కాదు. భారత్ ఎదుర్కొంటున్న కొత్త వాస్తవాళ్లను, ప్రాధాన్యాలను ప్రతిబింబించే వ్యూహాత్మక ప్రకటన. మౌనం కూడా ఒక రకమైన భాషే. ఈసారి ఆ భాషే ఎక్కువగా మాట్లాడింది. టెక్నాలజీ.. వ్యవసాయం.. రోడ్ల అనుసంధానం వంటి వాటిల్లో భారీగా పెట్టుబడులు గనుక పెరిగితే అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు అవుతాయి. వాటి ద్వారా ఉత్పత్తులు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తే భారీగా విదేశీ మారకద్రవ్యం వస్తుంది. తద్వారా దేశం ఆర్థికంగా బలోపేతం కావడానికి ఆస్కారం ఏర్పడుతుంది.ప్రధాని మోదీ చెప్పినట్లు, ఇప్పటి వరకు దశాబ్దాలు పట్టిన అభివృద్ధిని ఈ సప్తధార వ్యూహం ద్వారా 5 నుంచి 7 సంవత్సరాల్లోనే సాధించవచ్చని అంచనా. ఎందుకంటే ఈ ఏడు రంగాలు ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉన్నాయి. ఏఐ, డీప్‌టెక్ తయారీ, వ్యవసాయం, డిఫెన్స్‌లో సామర్థ్యం పెంచుతుంది. కనెక్టివిటీ గ్రీన్, బ్లూ ఎకానమీ, ఫుడ్ ప్రాసెసింగ్‌కు మార్కెట్లను తెరుస్తుంది. సాఫ్ట్ పవర్ భారత ఉత్పత్తులు, సేవలకు ప్రపంచ ఆమోదం పెంచుతుంది. ప్రపంచ మార్కెట్‌లో నిలదొక్కుకోవడానికి ఒక రంగంపై ఆధారపడితే సరిపోదు. బహుముఖ వ్యూహం అవసరం. సప్తధార ఈ అవసరాన్ని తీర్చేలా రూపొందింది కేంద్రం. ముఖ్యంగా పర్యావరణ సుస్థిరతను ఆర్థిక వృద్ధితో కలపడం ఆధునిక వ్యూహంలో భాగం.

# ఉమ్మడి సర్వీసు నిబంధనలే మేలు



రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు, బోధన తీరు, మౌలిక వసతులపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టనున్నది. విద్యాశాఖ ఏర్పాటు చేసిన అకడమిక్ ప్యానెల్ బృందాలు తరగతి గదుల్లో బోధన విధానం, పాఠ్య ప్రణాళిక, సిలబస్ పూర్తయిన తీరు, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు వంటి అంశాలను పరిశీలిస్తారు. విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం సామర్థ్యాలను కూడా అంచనా వేయనున్నారు. ఉపాధ్యాయులకు అవసరమైన విద్యాపరమైన సహకారం అందించడం, పాఠశాలల్లోని గ్రంథాలయాలు, ప్రయోగశాలలు, తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం, మధ్యాహ్న భోజన పథకం అమలు, భోజనం నాణ్యత, విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలు తదితర అంశాలపైనా బృందాలు దృష్టి సారించనున్నాయి. సర్కార్ బడుల్లో చదువు, బోధన, వసతుల అసలు పరిస్థితిని పర్యవేక్షించే పాఠశాల తనిఖీలు చాలా కాలంగా పడకేశాయి. ప్రధానంగా ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు రూల్స్ న్యాయవివాదాల నేపథ్యంలో ఎంఈవో, డిప్యూటీ ఈవో, డీఈవో ఖాళీల భర్తీ ప్రక్రియ నిలిచిపోయింది. విద్యాశాఖలో పనిచేస్తున్న డీఈవోలంతా ఇన్‌చార్జులే! వీరికి తరగతిలో ప్రత్యక్ష అనుభవం లేదు. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎంఈవో ఇన్‌చార్జులుగా అదనపు బాధ్యతలు నిర్వహించడంతో కీలకమైన తరగతి బోధన పరిశీలన నామమాత్రమైంది. అంతేకాదు, విద్యావ్యవస్థలో బోధన కంటే బోధనేతర బాధ్యతలు ఎక్కువయ్యాయి. ఎంఈవోలపై ఒత్తిడి పెరిగింది. పర్యవేక్షణ గాడి తప్పింది. కొత్త నియామకాలు చేపట్టకుండా, పాఠాలు చెప్పే రెగ్యులర్ ఉపాధ్యాయులకే అదనపు బాధ్యతలు కట్టబెట్టడం వలన ప్రయోజనం ఉండదు. ఈ నేపథ్యంలో మండలానికి ఇద్దరు ఎంఈవోలను నియమించాలనే ప్రతిపాదన చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రానికి కొత్తగా 33 జిల్లాలతో కూడిన రాష్ట్రపతి ఉత్తర్వులు 2018లో అమల్లోకి వచ్చాయి. ఈ ఉత్తర్వుల్లోని పేరా 3(3)లో పంచాయతీరాజ్, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల ఏకీకృతం గురించిన సవరణపై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. ఈ నేపథ్యంలో 2021లో పంచాయతీరాజ్ శాఖలోని వివిధ పోస్టులను లోకల్ క్యాడర్లుగా వర్గీకరిస్తూ అదే ఏడాది 204 జీవోను ఇచ్చారు. విద్యాశాఖలోని పోస్టులను జీవో 158 ద్వారా, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను జీవో 245 ద్వారా, మండల, జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులను జీవోలు 25గీ, 257 ద్వారా లోకల్ క్యాడర్లుగా వర్గీకరించారు. ఫలితంగా సుప్రీంకోర్టు/హైకోర్టు వివిధ సందర్భాల్లో ఇచ్చిన ఆదేశాల ప్రకారం వేర్వేరు లోకల్ క్యాడర్లుగా ప్రభుత్వ పాఠశాల, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులుగా వర్గీకరించినట్లు అయింది. అవసరమైతే న్యాయ సలహాలను కూడా స్వీకరించి రాష్ట్ర ప్రభుత్వం ఆర్టికల్ 309 ప్రకారం తనకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించి రెండు క్యాడర్లను ఏకీకృతం చేస్తూ సర్వీస్ రూల్స్ రూపొందించే అధికారం ఉన్నది. దీనివలన దశాబ్దాల తరబడి ఉపాధ్యాయుల పర్యవేక్షణ పోస్టుల భర్తీకి ఉన్న అడ్డంకి తొలగిపోతుంది. రాష్ట్రవ్యాప్తంగా గీగీ పోస్టులకుగాను గీ4 డిప్యూటీ విద్యాధికారి పోస్టులు, 33 జిల్లాలకుగాను 2గీ డీఈవో పోస్టులు ఖాళీలు ఉండడంతో విద్యాపాలన కుంటుపడింది. పర్యవేక్షణ పడకేసింది. ఎడ్యుకేషన్ కోడ్ ప్రకారం జరుగాల్సిన విద్యాపాలన అటకెక్కింది. ఫలితంగా ఉపాధ్యాయుల పనితీరు, బోధన, హాజరు, మధ్యాహ్న భోజనం, యూనిఫారాల వంటి అంశాలను పర్యవేక్షించే అవకాశం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో గీ30 మండలాలు ఉండగా...3గీ3 మండలాలకు మాత్రమే ఎంఈవో పోస్టులు మంజూరయ్యాయి. గత ప్రభుత్వం మరో 125 పోస్టులు మంజూరు చేసింది. ఇంకా 142 కొత్త మండలాలకు ఎంఈవో పోస్టులు మంజూరు కాలేదు. ఇద్దరు ఎంఈవోల వ్యవస్థను అమల్లోకి తేవాలంటే ఆ 142తోపాటు కొత్తగా గీ30 ఎంఈవో పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయాలి. 'రెండో ఎంఈవో వస్తే ఆ వ్యవస్థను తొలగించే అవకాశం ఉంటుంది. దానివల్ల 1,800 మంది ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాలలపై దృష్టి పెట్టవచ్చు. ప్రస్తుతం ఎంఈవోలు అటు పరిపాలనాపరమైన, ఇటు విద్యాపరమైన బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తున్నది. రెండో ఎంఈవో వస్తే వేర్వేరు బాధ్యతలు అప్పగించవచ్చు. ఫలితంగా పాఠశాలలపై పర్యవేక్షణ పెరుగుతుంది'. రాష్ట్ర విద్యామంత్రిగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యాశాఖలో పర్యవేక్షణ పోస్టులను భర్తీ చేయడానికి, ఉమ్మడి సర్వీసు నిబంధనలను అమలు చేయడానికి చొరవ చూపి విధానపరమైన నిర్ణయాలు తీసుకుని అమలు చేయాలని ఉపాధ్యాయులు ఆశిస్తున్నారు.

# సింహాసనం వణకలేదు, స్పందించింది!




సమాజ విశ్లేషకులు డానీ రాసిన 'సింహాసనం వణికింది' వ్యాసం (31.07.202గీ) నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై జరిగిన 'కాక్రోచ్' విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా రాసినట్టుగా కనపడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీని పూర్తిగా టార్గెట్ చేసింది. వ్యాసకర్త ఎక్కడా విద్యార్థుల ఆందోళనకు దారితీసిన పరిస్థితులపై కానీ, విద్యార్థుల డిమాండ్లను విశదీకరించటంపై కానీ, నీట్ లీక్ సూచనలపై కానీ దృష్టి పెట్టలేదు. మోదీని ప్రపంచ నియంతగా చూపించి హిట్లర్ పక్కన చేర్చే ప్రయత్నానికే అధిక ప్రాధాన్యత ఇచ్చారు.

జంతర్ మంతర్ ఉద్యమం మొదటి కోరిక కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా. ప్రధానమంత్రి విద్యార్థుల కోరిక తీర్చారు. కానీ డానీ మాత్రం, 'ఇంతకాలం ఒక నారటివ్‌ను మన చేత నమ్మించారు: భారత ప్రధాని సర్వశక్తిమంతులు, సర్వజ్ఞులు. వారు అనుకున్నదే జరుగుతుంది. ఎంతటివారైనా వారి పాదాక్రాంతం కావాల్సిందే. వారు హిమాలయాలంత ఎత్తులో ఉంటే, దేశంలోని ప్రధాన ప్రతిపక్ష నాయకుడు తూర్పు కనుమల్లోని చిన్న గుట్ట మాత్రమే,' అని వ్యాసకర్త తన ఊహాజనిత కథనం రాశారు. తాను హిమాలయాలంత ఎత్తు అన్న భావన ప్రధానికీ లేదు. తాను తూర్పు కనుమల్లోని చిన్న గుట్ట అన్న అభిప్రాయం ప్రతిపక్ష నాయకునికీ లేదు, ఆ పార్టీ శ్రేణులకూ లేదు. దేశ ప్రజలకూ లేదు. ఈ రెండు అభిప్రాయాలూ వ్యాసకర్త సొంత అభిప్రాయాలు మాత్రమే. ఆయన దృష్టిలో వారిరువురికీ ఇచ్చిన స్థానం అది. దానిని పాఠకులపై రుద్దే ప్రయత్నం చేశారు. 'షాహీన్ బాగ్, మూడు వ్యవసాయ చట్టాల వ్యతిరేక రైతు ఉద్యమం, మహిళా రెజ్లర్ల ఆందోళనలు వంటి సంఘటనలను సామాజిక వర్గాల ఉద్యమంగా ముద్ర వేసి సమాజం నుంచి వేరు చేశారు,' అంటూ అవి సాధించని విజయాన్ని జంతర్ మంతర్ సాధించిట్లు సూత్రీకరించారు వ్యాసకర్త. అవును, ఆ గత ఉద్యమాల పరిధి, విస్తృతి చిన్నది కాబట్టే అవి దేశవ్యాప్తం కాలేకపోయాయి. వాటి పట్ల కూడా కేంద్రం నియంత పోకడ ఎక్కడా చూపించలేదు. పరిష్కారం దిశగా ప్రభుత్వం ముందడుగు వేసింది. కాబట్టే అవి కొంతకాలం రగిలి శాంతించాయి. ఆ ఉద్యమాలు వేరు. జంతర్ మంతర్ ఆందోళన వేరు. మొదటివి కాస్తో కూస్తో అనుభవం, పెద్దరికం, నిర్దిష్టమైన నిర్మాణంతో ఉద్యమించాయి. జంతర్‌మంతర్‌లో 'బొద్దింకలు' మాత్రమే ఆందోళనలు చేశాయి. నాయకత్వం వహించాయి. ఇవి లేవనెత్తిన అంశం దేశవ్యాప్తమైన యువతకు సంబంధించిన సమస్య. కింది కులాల వారికంటే, అసంఖ్యాక మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాల సమస్య. కాబట్టే ఎలాంటి నిర్మాణం, నాయకత్వం, నిధుల సమీకరణ వంటి ముఖ్యమైన అంశాలు లేకున్నా, సోషల్ మీడియా పిలుపుతోనే బలమైన గొంతుకలను సమీకరించాయి, బలంగా వినిపించాయి. మరో కీలకమైన అంశం ఏమిటంటే, ఏ దేశంలోనైనా యువత ఆందోళనలు చాలా వాడిగా వేడిగా ఉంటాయి. వాటి పట్ల ప్రభుత్వాలు చాలా అప్రమత్తంగా ఉంటాయి. కట్టుదాటితే శాంతి భద్రతలు, దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. ఈ ప్రజాస్వామిక స్పృహ కేంద్రానికి బలంగా ఉంది. ఈ ఆందోళనలో కూడా ఎన్నో అపశ్రుతులు దొర్లాయి. మోదీ వ్యతిరేక శక్తులు ఇందులో పనిచేశాయి. రక్షణ బలగాలపై దాడులు జరిగాయి. ప్రధానిని, ఆయన తల్లిని అమానవీయకరమైన వ్యాఖ్యలు చేసి దూషించారు. అవి అవసరం లేదు. ఐనా ఎందుకు చేశారు? బహుశా ఉద్యమాన్ని రక్తపు మడుగుల దిశగా నడిపించాలని అదృశ్య శక్తులు తలపోసి ఉండవచ్చు. ఈ అంశాన్ని పసిగట్టే ప్రధాని 'మన పిల్లలు' అన్న భావనతో సమస్య పరిష్కారం కోసం ముందడుగు వేశారు. ధర్మేంద్ర ప్రధాన్ ఎంత బలమైన నాయకుడు ఐనా, తాను నమ్మిన నేత ఐనా, ఆయన నేతృత్వంలో బీజేపీ గెలుపు గుర్రం అధిరోహించినా, అప్పటికే నీట్‌పై కొన్ని సానుకూల నిర్ణయాలు తీసుకున్నా కూడా, విద్యార్థుల మొదటి డిమాండ్‌ను నెరవేర్చి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించారు ప్రధానమంత్రి. మిగిలిన రెండు డిమాండ్‌లను అంగీకరించారు. ఇది ప్రజాస్వామ్య పాలకుడికి ఉండాల్సిన మొదటి లక్షణం. నియంతలకు ఇలాంటి ఇజం ఉండదు. 'ఈ ఉద్యమం మరో ముఖ్యమైన విషయాన్ని కూడా నిరూపించింది. నాయకుడు అన్నీ తాను కాకూడదు. ప్రజలను ఉద్యమించేలా చేయాలి. ఇది సీట్ల కోసం, పదవుల కోసం, కూటముల కోసం పరస్పరం తగవులాడుకుంటూ రోజు రోజుకూ బలహీనపడుతున్న విపక్షాలకు ఒక గుణపాఠం. ప్రజలను వీధుల్లోకి తీసుకురండి. ప్రజలకు నాయకత్వం అప్పజెప్పండి' అంటూ విపక్షాలను కూడా నెమలి ఈకల విమర్శతో నిమిరారు వ్యాసకర్త. లేకపోతే తన లోగుట్టు పూర్తిగా బయటపడుతుందని, 'సమాజ విశ్లేషకులు' అన్న పదానికి మరక పడుతోందని జాగ్రత్తపడ్డారు, భయపడ్డారు. వెరసి, ఈ వ్యాసకర్త బొద్దింకల మాటున 'పెద్ద బొద్దింక'గా గుర్తింపు పొందేందుకు తెగ తాపత్రయపడ్డారు. ప్రధానమంత్రిని ఎంత బలంగా బోనులో నిలబెడితే, తనకు అంతే గుర్తింపువస్తుందని చాలా ఆశపడ్డారు.

## సవాళ్లకు సన్నద్ధం చేసే విద్యావిధానం కావాలి

నీట్ పరీక్షా పత్రం పదే పదే లీక్ కావడంతో మొదలైన నిరసన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అసంతృప్తికి వేదికగా మారి దేశవ్యాప్తంగా యువత విద్యావిధానంలో వైఫల్యాలపై ఉద్యమించింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు పట్టుపట్టిన యువత చివరకు విజయం సాధించింది. మంత్రి రాజీనామాకు ప్రాధాన్యత ఇచ్చారు. కానీ ఆయన స్థానంలో విద్యాశాఖను ఎవరికి అప్పగించారనే అంశాన్ని పట్టించుకోలేదు. మంత్రుల రాజీనామాలు యూపీఏలో ఉంటాయి, కానీ ఎన్డీయేలో కాదు అంటూ కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించిన తర్వాత ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో యువత డిమాండ్‌కు ప్రధాని మోదీ తలొగ్గారు. ప్రధాన్ స్థానంలో నియమించిన కొత్త విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని చూస్తే యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తీసుకున్న నిర్ణయంలా కనిపించడం లేదు. జోషి చదివింది సాధారణ బీఏనే. ప్రపంచానికి ఏఐ సవాల్ విసురుతున్న కాలంలో యువతను దీనికి అనుగుణంగా తీర్చిదిద్దడానికి విద్యావంతుడైన విద్యాశాఖ మంత్రి అవసరం ఎంతో ఉన్నది. కృత్రిమ మేధ ప్రపంచాన్ని వణికిస్తున్నది. ప్రపంచాన్ని శాసిస్తున్న ఐటీ కంపెనీలు కూడా ఏఐ ప్రభావం ఎంతవరకు ఉంటుందో చెప్పలేక పోతున్నారు. ఎలాన్ మస్క్ లాంటి వారు ఏఐ ఒక్క ఐటీ ఉద్యోగాలనే కాదు, డాక్టర్లు, లాయర్ల వృత్తులను కూడా మింగేస్తుందని జోస్యం చెప్తున్నారు. భారతీయ యువతకు ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయంటే అది ఐటీ రంగంతోనే. ఏఐ ఐటీ రంగాన్ని మింగేస్తే మొదట బలయ్యేది భారతీయ యువతనే. ఈ నేపథ్యంలో ఏఐ విసురుతున్న సవాళ్లకు యువతను సన్నద్ధం చేసే విద్యావిధానం ఉండాలి. మన దేశ యువతకు భవిష్యత్తులో ఏఐ, సెమీ కండక్టర్లు, డాటా సైన్స్, రోబోటిక్స్, పరిశోధన వంటి రంగాల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయి . ఇవన్నీ విద్యావిధానంతో ముడిపడి ఉన్నాయి. మన యువతను 2030-40లో లభించే ఉద్యోగాలకు సిద్ధం చేస్తున్నామా? ఆ మేరకు మన విద్యావ్యవస్థలో సంస్కరణలు చేపడుతున్నామా? లేదా? అనేది మన దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

# “కాకతీయుల కళా వైభవంపై... రాజకీయ ఫ్లెక్సీ నీడ!”

- తరతరాలకు నిలిచే చరిత్రను ప్రచారానికి వేదికగా మార్చడం దురదృష్టకరం
- కాకతీయ కళాతోరణమా... రాజకీయ ప్రచార వేదికా?
- చారిత్రక వారసత్వాన్ని కాపాడాల్సిన అధికారులు నిద్ర పోతున్నారా...
- అధికార పార్టీ నాయకుల అహంకారానికి ప్రతీక...బాల్నే జగన్
- చరిత్రకు గౌరవం ఇవ్వాల్సింది పోయి... రాజకీయ ప్రచారానికి వేదికగా మార్చడం శోచనీయం








**నర్సంపేట, ఆగస్టు 18 ::**

కాకతీయుల కళా వైభవానికి ప్రతీకగా నిలిచే కాకతీయ కళాతోరణం చరిత్రకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతిబింబం. అలాంటి చారిత్రక కట్టడాన్ని రాజకీయ ఫ్లెక్సీలతో కప్పివేయడం అత్యంత బాధాకరమని వరంగల్ జిల్లా బీజేపీ ప్రచార కార్యదర్శి బాల్నే జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్డు సిటీ సెంటర్‌లో ఉన్న కళాతోరణం కనిపించకుండా రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం ప్రజల మనోభావాలను దెబ్బతీసే చర్యగా ఆయన అభివర్ణించారు. చరిత్రను కాపాడాల్సిన చోట ప్రచారాన్ని కాపాడుకోవడం ఏం సంస్కారమని ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకులు తమ రాజకీయ కార్యక్రమాలకు ప్రచారం చేసుకోవడానికి ఎన్నో వేదికలు ఉన్నాయని, కానీ తెలంగాణ చరిత్రకు సాక్ష్యంగా నిలిచే కళాతోరణాన్ని మాత్రం రాజకీయ ప్రచారానికి ఉపయోగించకూడదన్నారు. ఒక తరం కట్టిన చారిత్రక సంపదను మరో తరం కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని, దాన్ని ఫ్లెక్సీలతో కప్పివేయడం మన చరిత్రను మనమే అవమానించుకున్నట్టేనని పేర్కొన్నారు. కళాతోరణం ప్రాధాన్యతను దెబ్బతీసేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుంటే అధికారులు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. ఎవరి అనుమతితో చారిత్రక కట్టడాన్ని ప్రచార వేదికగా మార్చారో అధికారులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే స్పందించి కళాతోరణాన్ని కప్పివేసిన రాజకీయ ఫ్లెక్సీలను తొలగించాలని, భవిష్యత్తులో చారిత్రక కట్టడాలపై ఎలాంటి రాజకీయ ప్రచార సామగ్రిని ఏర్పాటు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పురపాలక అధికారులు, సంబంధిత శాఖలను బాల్నే జగన్ డిమాండ్ చేశారు. కాకతీయ కళాతోరణం ఏ రాజకీయ నాయకుడి ఆస్తి కాదు, అది తెలంగాణ చరిత్రకు అస్తిత్వం. దాన్ని కాపాడటం మన అందరి బాధ్యతని బాల్నే జగన్ గుర్తు చేశారు.

# జేఎన్‌టీయూహెచ్ – ఇంజినీరింగ్ కళాశాల, కొస్గిలో బి.టెక్ స్పాట్ అడ్మిషన్లు

**కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. మేర్గు శ్రీనివాసులు**

**కోస్గి మున్సిపల్(మం) ఆగస్టు,18 :**

జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (JNTUH) పరిధిలోని జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, కొస్గి, నారాయణపేట్ జిల్లాలో 2026–27 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరం బి.టెక్‌లో మిగిలిన ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.జేఎన్‌టీయూహెచ్ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ★21-08-2026 ఉదయం 10.00 గంటలకు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, JNTUH, కూకట్‌పల్లి, హైదరాబాద్‌లో స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహించబడుతుంది. ఆసక్తి మరియు అర్హత కలిగిన విద్యార్థులు అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.బి.టెక్‌లో ప్రవేశం పొందే విద్యార్థులకు ట్యూషన్ ఫీజు సుమారు రూ.60,000/- వరకు ఉండవచ్చని, అయితే తుది ఫీజు JNTUH/TGEAPCET నిబంధనల ప్రకారం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులకు ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత ఉండదని నోటిఫికేషన్‌లో స్పష్టం చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.అభ్యర్థులు SSC లేదా సమానమైన మార్కుల మెమో, ఇంటర్మీడియట్ లేదా సమానమైన ధ్రువపత్రం, స్టడీ సర్టిఫికెట్లు, TGEAPCET-2026 ర్యాంక్ కార్డు (అర్హత ఉంటే), కుల ధ్రువపత్రం (వర్తిస్తే), నివాస ధ్రువపత్రం




(వర్తిస్తే), ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ తదితర అసలు ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు.కొస్గి పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకొని JNTUHకు చెందిన ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలో నాణ్యమైన ఇంజినీరింగ్ విద్యను పొందాలని ప్రిన్సిపాల్ కోరారు.మిగతా వివరాల కోసం ఈ నెంబర్ ల లో సంప్రదించాలని తెలిపారు. 6301444576, 9494751906, 9297000763- ప్రిన్సిపాల్జే ఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, కొస్గి నారాయణపేట్ జిల్లా, తెలంగాణ

# విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ

**ఆలేరు, ఆగస్టు 18::**



విద్యార్థులు విద్యా విషయాలపై మరింత శ్రద్ధ కనబరిచి ఉన్నత ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత నోట్‌బుక్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని డీఐఈఓ బి సురేష్‌రెడ్డి సూచించారు. ఆలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఐఈఓ బి. సురేష్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ పూజారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా డీఐఈఓ బి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన పుస్తకాలు, నోట్‌బుక్స్ అందిస్తోందని తెలిపారు. విద్యార్థులు వాటిని సక్రమంగా వినియోగించుకుని ప్రతిరోజూ పాఠాలను పునశ్చరణ చేసుకోవాలని సూచించారు. వార్షిక పరీక్షలకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సిద్ధమై మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా వినియోగంతో విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. చదువుపై ఏకాగ్రత పెంచుకుని ఉపాధ్యాయులు సూచించే అంశాలను శ్రద్ధగా అభ్యసిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పూజారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ తప్పనిసరిగా కళాశాలకు హాజరై తరగతులకు శ్రద్ధగా హాజరుకావాలని సూచించారు. ఉపాధ్యాయులు బోధించే పాఠాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ, సందేహాలను నివృత్తి చేసుకుని పరీక్షలకు సన్నద్ధం కావాలని కోరారు. క్రమశిక్షణ, నిరంతర సాధనతో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ బి శివకృష్ణ, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# NDPS అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా క్రైమ్ టీంకు శిక్షణ

- అదనపు ఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్
- జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా అదేశాలమేరకు

**వికారాబాద్, ఆగస్టు,18:**




వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ఐపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా క్రైమ్ టీం అధికారులకు NDPS కేసులపై ప్రత్యేక అవగాహనా శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా NDPS కేసుల దర్యాప్తు విధానం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా మార్గాల గుర్తింపు, నిందితులపై నిఘా, సాంకేతిక ఆధారాల వినియోగం, మాదకద్రవ్యాల స్వాధీనం మరియు చట్టపరమైన నిబంధనలపై అధికారులకు అవగాహన కల్పించారు.జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సరఫరా మరియు వినియోగాన్ని అరికట్టడమే ప్రధాన లక్ష్యంగా పకడ్బందీగా పనిచేయాలని, అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులు మరియు నెట్‌వర్క్‌లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అదనపు ఎస్పీ సూచించారు.“డ్రగ్ ఫ్రీ – క్రైమ్ ఫ్రీ వికారాబాద్” లక్ష్యంతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.కార్యక్రమంలో DTC డీఎస్పీ శ్రీనివాస్, CCS ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్, జిల్లా క్రైమ్ టీం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సహాయ నిధి ఎల్ఓసీ చెక్కు అందజేత

**పిఏసీఎస్ చెర్మెన్ గుళ్ల నర్సిములు, సర్పంచ్ యం. సాయప్ప,**

**మద్దూరు మండలం, ఆగస్టు,18:**

మద్దూర్ మండలం ఖాజీపూర్ గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల హనుమంతుకు ఆరోగ్య సమస్య ఏర్పడటంతో, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.1,50,000/- (లక్షా యాభై వేల రూపాయలు) విలువైన ఎల్ఓసీ మంజూరు కావడం జరిగింది.కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జి ఏనుముల తిరుపతి రెడ్డి అండదండలతో కాడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి,మరియు మద్దూర్ మండల పిఏసీఎస్ చైర్మన్ గుళ్ళ నర్సిములు సహకారంతో ఈ ఎల్ఓసీ మంజూరైంది.ఈ సందర్భంగా మంజూరైన ఎల్ఓసీ చెక్కును మద్దూర్ మండల పిఏసీఎస్ చైర్మన్ గుళ్ళ నర్సిములు,ఖాజీపూర్ గ్రామ సర్పంచ్ యం.సాయప్ప లబ్ధిదారుడు పిచ్చకుంట్ల హనుమంతుకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, బి. శాంతుకుమార్, కానగడ్డ గోవిందు కాంగ్రెస్ పార్టీ నాయకులు జి. రఘు యాదవ్, సినామొల్ల శ్రీనివాస్, ఖాజా, చల్లాపురం క్రిష్ణ, పిచ్చకుంట్ల కృష్ణ, కే. భీంరాజ్, తుంగవాట్ల లాలూ, అశోక్,తదితరులు పాల్గొన్నారు.



# ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ పునఃప్రారంభం

## ఆగస్టు 20 సాయంత్రం 6 గంటల వరకు అవకాశం

**హైదరాబాద్, ఆగస్టు 18::**

తెలంగాణలో 2026–27 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్, డెంటల్ కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం (KNRUHS) తిరిగి ప్రారంభించింది. నీట్ యూజీ–2026లో నిర్ణీత కటాఫ్ లేదా అంతకంటే ఎక్కువ మార్కులతో అర్హత సాధించిన అభ్యర్థులు ఆగస్టు 18 మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆగస్టు 20 సాయంత్రం 6 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకుని సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయవచ్చని తెలిపింది. ఇప్పటికే దరఖాస్తు సమర్పించిన వారు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఇతర వివరాలకు గతంలో జారీ చేసిన నోటిఫికేషన్, ప్రాస్పెక్టస్‌ను పరిశీలించాలని సూచించింది.

# ఉద్యమకారుల వర్గీకరణపై కీలక కసరత్తు

## కేకే నేతృత్వంలో ఉన్నతస్థాయి సమీక్ష — త్వరలో దరఖాస్తులకు ప్రత్యేక పోర్టల్

**హైదరాబాద్, ఆగస్టు 18:**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, వర్గీకరణతో పాటు సంక్షేమ విధివిధానాలపై తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కీలక కసరత్తు చేపట్టింది. కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు నివాసంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, కమిటీ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. అమరదీపం వేదికగా 16 రోజుల పాటు 13 వేల మందికి పైగా ఉద్యమకారులు, ప్రజాసంఘాలు, వివిధ జేఏసీల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా రూపొందించిన ముసాయిదాపై సమావేశంలో సమీక్షించారు. ఉద్యమకారులను అమరుల కుటుంబాలు, ఉద్యమంలో గాయపడినవారు, జైలు జీవితం గడిపినవారు, కేసులు ఎదుర్కొన్నవారు అనే ప్రధాన కేటగిరీలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, మహిళా ఉద్యమకారులు, ధూమ్‌ధామ్ కళాకారులు, వివిధ సంస్థల్లో క్రియాశీలంగా పనిచేసిన వారిని ప్రత్యేక కేటగిరీలుగా గుర్తించే అంశాన్ని పరిశీలించారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, ప్రశంసాపత్రాలతో పాటు అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలం, గృహ నిర్మాణ సహాయం, పెన్షన్, ఆర్టీసీ ఉచిత ప్రయాణం, పిల్లలకు ఉచిత విద్య, స్వయం ఉపాధి రుణాలు వంటి సంక్షేమ చర్యలపై చర్చించారు. జార్ఖండ్, ఉత్తరాఖండ్ తరహాలో సంక్షేమానికి చట్టబద్ధత కల్పించి శాశ్వత కమిషన్ లేదా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కూడా చర్చకు వచ్చింది. ఉద్యమకారుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు త్వరలో ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాసంఘాలతో సంప్రదింపులు పూర్తి చేసి, సమగ్ర నివేదికను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి సమర్పించనున్నట్లు కమిటీ తెలిపింది.

# డా.బీ. ఆర్.అంబేడ్కర్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి కి వినతి

## కోడంగల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దాము



**కొడంగల్ మున్సిపల్, ఆగస్టు,18:**

వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణ కేంద్రంలో డాక్టర్. బీ. ఆర్.అంబేద్కర్ భవన నిర్మాణ పనులను పూర్తి చేయడానికి మూడు కోట్ల రూపాయలు కేటాయించాలని కొడంగల్ పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దాము హైదరాబాద్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలొ కాంగ్రెస్ నాయకులు దస్తప్ప, అశోక్, సాయిలు, రమేష్, లక్షమప్ప.తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గడ్డపై ఉద్యమకారుడి విగ్రహానికి చోటు లేదా..?

## పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని అదే స్థానంలో ప్రభుత్వమే పునఃప్రతిష్ఠించాలి... సిరికొండ మధుసూదనాచారి

**హనుమకొండ, ఆగస్టు 18 ::** తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తొలగించడం నీచమైన చర్య అని మాజీ శాసనసభ స్పీకర్, బీఆర్ఎస్ నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సంపేట నియోజకవర్గ ప్రజల గుండెల్లో పెద్ది సుదర్శన్ రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారని మధుసూదనాచారి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆయన ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని పేర్కొన్నారు. తెలంగాణ గడ్డపై తెలంగాణ ఉద్యమకారుల విగ్రహాలను ఏర్పాటు చేసుకునే హక్కు లేదా అని ప్రశ్నించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని ఎందుకు తొలగించాల్సి వచ్చిందో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తొలగించిన అదే ప్రదేశంలో ప్రభుత్వమే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వంపై బీసీలకు సంబంధించిన హామీల విషయంలో మధుసూదనాచారి విమర్శలు చేశారు. పరకాలకు వచ్చిన సందర్భంగా బీసీల కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని, ఇప్పటి వరకు ఎంత మొత్తం ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు సామాజిక న్యాయం చేస్తామని చెబుతూ అడుగడుగునా అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. బీసీ సామాజిక వర్గాలకు ఎన్ని ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారు, ఎంతమందికి నామినేటెడ్ పదవులు ఇచ్చారో ప్రభుత్వం వెల్లడించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఉండగా సీనియర్ కాంగ్రెస్ నాయకులకు తానే పదవులు ఇస్తున్నానని చెప్పడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, సరైన ఆలోచన, అవగాహన లేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారని సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు.

## అంగన్వాడీ టీచర్ నియామకాలకు సర్టిఫికెట్ల పరిశీలన

- వేములవాడలో 12 పోస్టులకు 350, సిరిసిల్లలో 43 పోస్టులకు 1,125 దరఖాస్తులు
- ఎంపిక పూర్తి పారదర్శకంగా.. దళారులను నమ్మవద్దు

**రాజన్న సిరిసిల్ల ఆగస్టు18:**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాల మేరకు అంగన్వాడీ టీచర్ పోస్టుల నియామకానికి సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మి రాజం తెలిపారు.

వేములవాడ ప్రాజెక్టులో 12 పోస్టులకు 350 దరఖాస్తులు రాగా, ఆగస్టు 18, 19 తేదీల్లో షెడ్యూల్ ప్రకారం సీడీపీఓ కార్యాలయంలో పరిశీలన నిర్వహిస్తారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ ప్రతులు తీసుకురావాలి. సిరిసిల్ల ప్రాజెక్టులో 43 ఖాళీలకు 1,125 దరఖాస్తులు వచ్చాయి. ఆర్డీవో కార్యాలయ సముదాయానికి ఎదురుగా ఉన్న కమ్యూనిటీ హాల్‌లో 18న ఇల్లంతకుంట, వీర్నపల్లి; 19న ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట; 20న గంభీరావుపేట, తంగళ్లపల్లి; 21న సిరిసిల్ల పట్టణ పరిధి అభ్యర్థులకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరిశీలన నిర్వహిస్తారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా నిబంధనలు, ప్రతిభ ఆధారంగా పారదర్శకంగా జరుగుతుందని, ఎలాంటి పైరవీలకు అవకాశం లేదని లక్ష్మి రాజం స్పష్టం చేశారు. ఉద్యోగాల పేరుతో దళారులను నమ్మి మోసపోవద్దని అభ్యర్థులకు సూచించారు.

## ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి: కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, ఆగస్టు 18:**లోటు వర్షపాతం, ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరికి బదులుగా తక్కువ నీటి అవసరమున్న ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. భీమారం మండలంలోని గొల్లవాగు ప్రాజెక్టును పరిశీలించి నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మోడల్ ఇందిరమ్మ ఇళ్లు, తహసీల్దార్ కార్యాలయ స్థలం, పీహెచ్‌సీ, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారులకు సూచించారు.

## భద్రకాళి బండ్ పై 'ఈ-వాహనం' పరుగులు..

- సందర్శకులకు ఇక మరింత సౌకర్యం!.చెరువు సుందరీకరణతో వరంగల్ కు కొత్త అందం..
- పర్యాటక కేంద్రంగా అభివృద్ధే లక్ష్యం... ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- భక్తి.. ప్రకృతి.. పర్యాటకం.. భద్రకాళి బండ్ కు సరికొత్త సొబగులు




**వరంగల్, ఆగస్టు 18 ::** నగరంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ భద్రకాళి దేవస్థానం పరిధిలో భద్రకాళి చెరువు సుందరీకరణలో భాగంగా నిర్మించిన భద్రకాళి బండ్‌పై సందర్శకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వెహికిల్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, కమిషనర్ వెంకన్న, కుడా అధికారులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కుడా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ భద్రకాళి చెరువు సుందరీకరణతో వరంగల్ నగరానికి మరింత అందం చేకూరిందన్నారు. భద్రకాళి బండ్‌పై సందర్శకులను ఆకట్టుకునేలా వివిధ అభివృద్ధి, సుందరీకరణ పనులను చేపట్టినట్లు తెలిపారు. భక్తులు, నగరవాసులు, పర్యాటకులు ప్రశాంతమైన వాతావరణంలో బండ్‌పై విహరిస్తూ చెరువు అందాలను ఆస్వాదించేలా మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు, ఎక్కువ దూరం నడవలేని వారికి ఎలక్ట్రిక్ వెహికిల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. భద్రకాళి దేవస్థానం, చెరువు పరిసరాలను సమగ్రంగా అభివృద్ధి చేసి ఆధ్యాత్మికతతో పాటు పర్యాటక ఆకర్షణకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, కుడా, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు భద్రకాళి బండ్‌ను వరంగల్ నగరంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. సుందరీకరణలో భాగంగా బండ్‌పై పచ్చదనం, నడక మార్గాలు, సందర్శకులకు అనుకూలమైన వసతులు, ఆహ్లాదకరమైన పరిసరాలతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్‌లో సందర్శకుల రద్దీకి అనుగుణంగా మరిన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కుడా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నేడు తెలంగాణ అమరవీరుల స్తూపం శంకుస్థాపనకు ఏర్పాట్లు



**ఆలేరు, ఆగస్టు 18::** తెలంగాణ మలిదశ ఉద్యమకారుల పోరాట స్ఫూర్తిని చాటిచెప్పేలా ఆలేరు పట్టణంలోని అమరవీరుల చౌరస్తాలో తెలంగాణ అమరవీరుల స్తూపం నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆలేరులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి కార్యక్రమ ఏర్పాట్లు, విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఆలేరు రైల్వే గేటు సమీపంలోని అమరవీరుల చౌరస్తాలో జరిగే స్తూపం శంకుస్థాపన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే మోత్కుపల్లి నర్సింహులు, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ నగేష్, సునీత మహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యతో పాటు కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి, పీఏసీఎస్ చైర్మన్ జనగాం ఉపేందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్. జనార్దన్, సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి తదితరులు కార్యక్రమానికి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు, అన్ని వార్డుల కౌన్సిలర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) తదితర పార్టీల రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ స్థాయి నాయకులు పాల్గొననున్నట్లు తెలిపారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు, తెలంగాణ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, యువత, సకల జనులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమరవీరులకు నివాళుల ర్పించాలని నిర్వాహకులు కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారి ఆశయాలను భవిష్యత్ తరాలకు తెలియజేసేలా అమరవీరుల స్తూపం నిలిచిపోతుందని వారు పేర్కొన్నారు. ఉద్యమకారులందరూ ఈ కార్యక్రమాన్ని తమకు అందించిన ఆహ్వానంగా భావించి తప్పక హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# ఒక్క క్లిక్...ఒక క్షణం...ఒక జ్ఞాపకం...

- ప్రతీ ఫ్రేమ్ ఓ భావం... ప్రతి క్లిక్ ఓ జ్ఞాపకం... సురేష్ ఫోటోగ్రఫీ
- చిరునవ్వు నుంచి చినుకుదాకా... క్షణాల రెక్కలకు... జ్ఞాపకాల చిరునామా...
- కళ్లముందు కరిగే దృశ్యాలకు...కాలం చెరిపేయలేని జ్ఞాపకాలు... ఫోటోలు
- 'ప్రపంచ ఫోటోగ్రఫీ డే' సందర్భంగా ఫోటోగ్రాఫర్ 'బండారి సురేష్' చిత్రయానం






**నర్సంపేట, ఆగస్టు 18 ::**

ఒక క్షణం, కాలం గడిచిపోయినా జ్ఞాపకంగా మిగిలిపోవాలంటే ఓ ఫొటో చాలు. మాటల్లో చెప్పలేని భావాన్ని, కళ్లకు కనిపించిన అందాన్ని, మనసును తాకిన అనుభూతిని ఒకే ఫ్రేమ్‌లో బంధించేది ఫోటోగ్రఫీ. కాలం ఎవరి కోసం ఆగదు... క్షణాలు ఎవరి కోసం నిలవవు. కానీ ఒక అందమైన ఛాయాచిత్రం మాత్రం ఓ క్షణాన్ని శాశ్వతంగా నిలిపేస్తుంది. మనసుకు హత్తుకున్న దృశ్యాన్ని, మరచిపోలేని అనుభూతిని, మధురమైన జ్ఞాపకాన్ని ఒక్క క్లిక్‌తో జీవితాంతం మన కళ్లముందు ఉంచే అద్భుత కళే ఫోటోగ్రఫీ. ఫోటోగ్రఫీకి మార్గం వేసిన మహనీయుల కృషిని స్మరించుకోవడంతో పాటు, నేటి ఫోటోగ్రాఫర్ల సృజనాత్మకతకు గౌరవం చాటే రోజు ఇది.

**నేడు 'ప్రపంచ ఫోటోగ్రఫీ డే'...**

"1839 ఆగస్టు 19న డాగ్యూరే ఆవిష్కరించిన ఫోటోగ్రఫీ ప్రక్రియ ప్రపంచానికి పరిచయమైంది. ఆ చారిత్రక ఘట్టాన్ని స్మరించుకుంటూ ఆగస్టు 19న ప్రపంచ ఫోటోగ్రఫీ డే జరుపుకుంటున్నాం. కాలాన్ని క్షణంలో బంధించే కళకు, దానికి మార్గం చూపిన మహనీయుడి కృషికి ఇది ఒక నివాళి."

**ఒక్క క్లిక్... ఒక కథ... ఒక అనుభూతి...**

కాలం ముందుకు సాగుతుంది. మనుషులు మారిపోతారు. ప్రదేశాలు మారిపోతాయి. కానీ ఒక ఫ్రేమ్‌లో బంధించిన క్షణం మాత్రం అక్కడే నిలిచిపోతుంది. అందుకే ఫోటోగ్రఫీ కాలానికి వేసిన ఓ అందమైన సంతకం. మాటలు చెప్పలేని భావాలను చిత్రాలు చెబుతాయి. మరచిపోయిన రోజులను మళ్లీ కళ్లముందుకు తీసుకొస్తాయి. దూరమైన మనుషులను జ్ఞాపకాలలో దగ్గర చేస్తాయి. గతాన్ని వర్తమానంలో నిలిపే శక్తి ఫోటోగ్రఫీకి ఉంది. ఫోటోగ్రఫీని వృత్తిగా మాత్రమే కాకుండా ఓ మక్కువగా, ఓ కళగా, ఓ అనుభూతిగా మలుచుకున్న వ్యక్తి నర్సంపేటకు చెందిన ఫోటోగ్రాఫర్ బండారి సురేష్. ప్రపంచ ఫోటోగ్రఫీ డే సందర్భంగా సురేష్ కెమెరా నుంచి జాలువారిన అద్భుత చిత్రాలు ఆయన ప్రతిభకు అద్దం పడుతున్నాయి. ఎక్కడ ఏ అందమైన దృశ్యం కనిపించినా... ఏ అరుదైన క్షణం ఎదురైనా... దాన్ని తన కెమెరాలో బంధించాలనే తపన సురేష్ ప్రత్యేకత. ఫోటోగ్రఫీ కేవలం ఒక చిత్రం కాదు, కాలాన్ని బంధించే కళ, జ్ఞాపకాలకు జీవం పోసే మౌన భాష. ప్రకృతి అందాల నుంచి మనుషుల జీవన చిత్రాల వరకు... పండుగల సందడి నుంచి పల్లె జీవన సౌందర్యం వరకు... సాధారణ కళ్లకు కనిపించే దృశ్యాల్లోనూ అసాధారణమైన అందాన్ని గుర్తించి, తన కెమెరా కంటితో దానికి ప్రాణం పోయడం సురేష్ ఫోటోగ్రఫీలో కనిపించే ప్రత్యేకత.

**క్షణం కరిగిపోవచ్చు... జ్ఞాపకం చెరిగిపోవచ్చు...**

కానీ మంచి 'ఛాయాచిత్రం' మాత్రం కాలాన్ని దాటి మాట్లాడుతూనే ఉంటుంది...

ఫొటో తీయడం కాదు... ఒక క్షణాన్ని శాశ్వతం చేయడం" అనే భావనతో కెమెరాను చేతబట్టిన సురేష్, ఎన్నో అద్భుత చిత్రాలను ఆవిష్కరించారు. ప్రతి ఫ్రేమ్‌లో ఆయన పరిశీలన, సృజనాత్మకత, సహజత్వం స్పష్టంగా కనిపిస్తాయి. అందుకే ఆయన తీసిన చిత్రాలు చూసినవారిని కాసేపు ఆగి చూడాలనేలా చేస్తాయి. ఆకోవలోకి చెందిన వ్యక్తే బండారి సురేష్. ఫోటోగ్రఫీపై ఉన్న మక్కువతో నిరంతరం కొత్తదనాన్ని అన్వేషిస్తూ ముందుకు సాగుతున్న సురేష్ ఇప్పటికే ఎన్నో అవార్డులు, రివార్డులు సొంతం చేసుకున్నారు. తన ప్రతిభకు లభించిన ప్రతి గుర్తింపును మరింత మెరుగ్గా పనిచేయాలనే ప్రేరణగా భావిస్తూ, ఫోటోగ్రఫీ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రకృతి అందాలు, మనుషుల భావోద్వేగాలు, పల్లె జీవన చిత్రాలు, పండుగల సందడి... ఇలా తన కెమెరా కంటికి కనిపించిన ప్రతి అందమైన క్షణాన్నీ జ్ఞాపకంగా మలుస్తున్నారు. కెమెరా ఆయన చేతిలో కేవలం ఓ పరికరం కాదు... కాలాన్ని నిలిపే కలం. ఆయన క్లిక్ చేసే ప్రతి ఫొటో ఓ కథ చెబుతుంది. కొన్ని చిత్రాలు ఆనందాన్ని పంచుతాయి... మరికొన్ని ఆలోచింపజేస్తాయి... ఇంకొన్ని మనసును హత్తుకుంటాయి. అదే సురేష్ ఫోటోగ్రఫీ గొప్పతనం. ప్రపంచ ఫోటోగ్రఫీ డే సందర్భంగా సురేష్ ప్రయాణం యువ ఫోటోగ్రాఫర్లకు స్ఫూర్తిగా నిలుస్తోంది. మక్కువను సాధనగా మార్చుకుంటే ప్రతిభకు గుర్తింపు తప్పదని ఆయన ఫోటోగ్రఫీ ప్రయాణం నిరూపిస్తోంది. కాలం మారినా, మనుషులు మారినా, ఆ ఫ్రేమ్‌లో బంధించిన భావం మాత్రం ఎప్పటికీ సజీవంగానే ఉంటుంది. ఆ సజీవ జ్ఞాపకాలకు రూపమిస్తున్న బండారి సురేష్ ఫోటో గ్రాఫర్లందరికి 'ప్రపంచ ఫోటోగ్రఫీ డే' శుభాకాంక్షలు తెలిపారు.

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి పంటల సాగు

- ఎరువుల పంపిణీలో పారదర్శకతకు ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌పై అవగాహన

**ఆలేరు, ఆగస్టు 18 ::**



ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని, తక్కువ నీటి లభ్యతలోనూ మెరుగైన దిగుబడులు సాధించే పంటలపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. ఆలేరు మండలంలోని కొలనుపాక, శారాజీపేట గ్రామ పంచాయతీల వద్ద మంగళవారం రైతులకు ఆరుతడి పంటల సాగు, ఆయిల్‌ఫామ్ పంట, కేంద్ర ప్రభుత్వ నూతన ఫర్టిలైజర్ యాప్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కొలనుపాకలో ఏఈవో శివకుమార్, శారాజీపేటలో ఏఈవో భార్గవి రైతులకు ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాల్సిన పంటలపై వివరించారు. పెసర, మినుము, ఉలవ, నువ్వు, జొన్న వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. పంటల ఎంపిక, విత్తనాల ఎంపిక, సస్యరక్షణ చర్యలు, పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు సూచనలు అందించారు.

**ఆయిల్‌ఫామ్ సాగుకు ప్రోత్సాహం**

రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్న ఆయిల్‌ఫామ్ సాగుపై కూడా రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌ఫామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూమి స్వభావం, నీటి వసతి, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఆయిల్‌ఫామ్ సాగు చేపట్టాలని తెలిపారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత కేంద్ర ప్రభుత్వం ఎరువుల పంపిణీలో పారదర్శకతను పెంచేందుకు తీసుకొచ్చిన ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ (FFS) యాప్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఎరువుల లభ్యత, పంపిణీ ప్రక్రియను డిజిటల్ విధానంలో పర్యవేక్షించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని వివరించారు. రైతులకు ఎరువులు సక్రమంగా అందేలా ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో కొలనుపాకలో పంచాయతీ కార్యదర్శి ఉమేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది, శారాజీపేటలో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఆయా గ్రామాల

# ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ

**బహుజనుల ఐక్యత, అభివృద్ధికి పాపన్న స్ఫూర్తి: మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్, ఆగస్టు 18:** ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ భారీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం బహుజనుల చిరకాల ఆకాంక్ష నెరవేరిన సందర్భమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బహుజనులను ఏకం చేసి మొఘల్ పాలకులను ఎదుర్కొని గోల్కొండ కోటను జయించిన పాపన్న గౌడ్ భవిష్యత్ తరాలకు స్ఫూర్తి అని కొనియాడారు. బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం బీసీ కులగణన, గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా, కాటమయ్య రక్షక కవచాలు వంటి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. జనగణన ప్రశ్నావళిలో ఓబీసీ అంశానికి స్పష్టమైన ప్రాధాన్యం లేకపోవడాన్ని కేంద్ర ప్రభుత్వ వైఖరిగా పేర్కొంటూ ఖండించారు. బహుజనులు విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు సాగుతూ పాపన్న గౌడ్ స్ఫూర్తితో ఐక్యంగా అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు.

# చరిత్రను తిరగరాసిన బహుజన వీరుడు.. సర్వాయి పాపన్న

- అణచివేతకు ఎదురొడ్డి నిలిచిన ఆయన జీవితం నేటికీ స్ఫూర్తిదాయకం
- పాపన్న అడుగుజాడల్లో.. ఆత్మగౌరవ పోరాటం
- నగరంలో పాపన్న గౌడ్ భారీ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తా...ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**హనుమకొండ, ఆగస్టు 18 ::** తెలంగాణ ప్రాంతంలోని బహుజన, పేద, బడుగు బలహీన వర్గాల విముక్తి కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం, పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను మంగళవారం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి ఆధ్వర్యంలో, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం, సామాజిక సమానత్వం కోసం పాపన్న గౌడ్ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. పాపన్న గౌడ్ ఒక కులానికే పరిమితమైన నాయకుడు కాదని, పేదలు, అణగారిన వర్గాల పక్షాన నిలిచిన మహనీయుడని కొనియాడారు. బహుజన చక్రవర్తి పాపన్న గౌడ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సాధారణ కుటుంబంలో జన్మించి గీత కార్మికుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన పాపన్న గౌడ్ అణచివేత, వివక్ష, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన మహాయోధుడని నాగరాజు పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందన్నారు. నగరంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థల సేకరణపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఉమ్మడి జిల్లా గౌడ్ కమిటీ సభ్యులు కూడా విగ్రహ స్థల సేకరణ కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. త్వరలోనే పాపన్న గౌడ్ భారీ విగ్రహ ఆవిష్కరణ జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై కూడా పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ప్రభుత్వం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు, 1వ డివిజన్ అధ్యక్షుడు చిర్ర రాము, కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యుడు చిర్ర రాజు, జిల్లా గౌడ్ కమిటీ సభ్యులు, జిల్లా ప్రముఖులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వాహనాలను కండిషన్‌లో ఉంచుకోవాలి

అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ ఉల్ హక్



**నారాయణపేట,ఆగస్టు,18:** నారాయణపేట జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని పోలీసు వాహనాలను అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ ఉల్ హక్ మంగళవారం తనిఖీ నిర్వహించారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహించే వాహనాలు ఎల్లప్పుడూ మంచి కండిషన్‌లో ఉండేలా అధికారులు, డ్రైవర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు వాహనాలు శాంతిభద్రతల పరిరక్షణ, పెట్రోలింగ్, అత్యవసర సేవలు, నేరాల నియంత్రణ వంటి కీలక విధుల్లో నిరంతరం వినియోగంలో ఉంటాయని తెలిపారు. అందువల్ల వాహనాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతిరోజూ పరిశీలించి, అవసరమైన సర్వీసింగ్, మరమ్మతులు వెంటనే చేయించుకోవాలని సూచించారు.ప్రతి రోజు విధులకు వెళ్లే ముందు వాహనాలను పూర్తిగా శుభ్రం చేసుకోవడంతో పాటు టైర్లు, బ్రేకులు, ఇంజిన్ ఆయిల్, కూలెంట్, బ్యాటరీ, లైట్లు, ఇండికేటర్లు, హారన్ తదితరాలను పరిశీలించుకోవాలని డ్రైవర్లకు సూచించారు. వాహనాల మెకానిజం, ప్రాథమిక సాంకేతిక అంశాలపై ప్రతి డ్రైవర్‌కు పూర్తి అవగాహన ఉండాలని అన్నారు. వాహనంలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తినప్పుడు దానిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయించుకోవాలని తెలిపారు. వాహనం కండిషన్‌లో లేకపోతే అత్యవసర సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు.అదేవిధంగా డ్రైవింగ్ చేసే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, వేగ నియంత్రణ పాటిస్తూ అప్రమత్తంగా వాహనాలు నడపాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా డ్రైవింగ్‌లో జాగ్రత్తలు పాటిస్తూ పోలీసు సిబ్బంది, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పోలీసు వాహనాల నిర్వహణ, భద్రత, డ్రైవర్ల పనితీరుపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని అదనపు ఎస్పీ ఆదేశించారు. వాహనాలను శుభ్రంగా, సక్రమంగా, ఎల్లప్పుడూ వినియోగానికి సిద్ధంగా ఉంచడం ప్రతి డ్రైవర్ బాధ్యత అని స్పష్టం చేశారు.ఈ తనిఖీలో MTO RI విజయ్ భాస్కర్, పోలీసు వాహన డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

# గాజులపేట పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్‌కు కలెక్టర్ ఆదేశం

రికార్డుల నిర్వహణలో లోపాలు, నిధుల దుర్వినియోగం గుర్తింపు

**మహబూబ్‌నగర్, ఆగస్టు 18::** మహబూబ్‌నగర్ రూరల్ మండలం గాజులపేట గ్రామపంచాయతీ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ తీర్మానం లేకుండా నిధులు వినియోగించడంతో పాటు కొన్ని తీర్మానాలు నకిలీవిగా ఉన్నట్లు గుర్తించిన కలెక్టర్, పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం, విద్యాబోధన, విద్యుత్, ఫ్యాన్లు, లైట్ల సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైన విద్య అందించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో పర్యటిస్తుండగా అనుమతులు లేకుండా మద్యం తరలిస్తున్న వాహనాన్ని గుర్తించిన కలెక్టర్, వాహనాన్ని స్వాధీనం చేసుకుని సమగ్ర విచారణ చేపట్టాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. అక్రమ మద్యం విక్రయాలకు బాధ్యులైన వారి లైసెన్సుల రద్దుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

# నాణ్యమైన విద్యకు చిరునామా... ఇంటిగ్రేటెడ్ పాఠశాల...

- పేద, బడుగు వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం
- ఇంటిగ్రేటెడ్ సమగ్ర పాఠశాల నిర్మాణానికి డైట్ కళాశాల స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే 'నాయిని'



**హనుమకొండ, ఆగస్టు 18 ::** పేద, బడుగు వర్గాల విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యా సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ సమగ్ర పాఠశాల నిర్మాణానికి సంబంధించి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని డైట్ కళాశాల ప్రాంగణాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మంగళవారం రెవెన్యూ, ఆర్‌వీఎం అధికారులతో కలిసి పరిశీలించారు. డైట్ కళాశాలకు సంబంధించి సుమారు 10.10 గుంటల స్థలం అందుబాటులో ఉన్న నేపథ్యంలో, ఇంటిగ్రేటెడ్ సమగ్ర పాఠశాల నిర్మాణానికి స్థలం అనుకూలత, కళాశాల హద్దులు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, రాకపోకలకు అనువైన పరిస్థితులను ఎమ్మెల్యే పరిశీలించారు. స్థలానికి సంబంధించిన కోఆర్డినేట్స్‌ను సకాలంలో అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలు, హద్దులు, కోఆర్డినేట్స్‌ను సేకరించి పాఠశాల నిర్మాణానికి అవసరమైన తదుపరి చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. స్థల పరిశీలన, హద్దుల నిర్ధారణ, ఇతర పరిపాలనా ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ పేద, బడుగు వర్గాల విద్యార్థులకు కూడా నాణ్యమైన, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ సమగ్ర పాఠశాలలను ఏర్పాటు చేస్తోందన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు, సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి కేటాయించిన ఇంటిగ్రేటెడ్ సమగ్ర పాఠశాల నిర్మాణం త్వరితగతిన ప్రారంభమయ్యేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ఎంఆర్ఓ రవీందర్ రెడ్డి, ఆర్ఐ దశరథ రామ్ రెడ్డి, ఆర్‌వీఎం ఏఈ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

# కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా 'పగడాల'

- మృతుల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసిన బీజేపీ నేత డా.పగడాల కాళీ ప్రసాద్ రావు




**పరకాల, ఆగస్టు 18 ::**

పరకాల నియోజకవర్గం ఆత్మకూరు మండలం చౌలపల్లి గ్రామానికి చెందిన ఆదరసాని బాపూరావు, ఆత్మకూర్ లక్ష్మీబాయి, పూజారి లక్ష్మయ్య, కొనగాని కనకయ్యలు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు మంగళవారం వారి కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి బాధలో తాము భాగస్వాములమని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసి, కష్టకాలంలో పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములుగా నిలవడం తమ బాధ్యత అని పగడాల కాళీ ప్రసాద్ రావు తెలిపారు. మృతుల కుటుంబాలకు భవిష్యత్తులోనూ అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉపగాళ్ల శ్రీకాంత్ రెడ్డి, చౌలపల్లి గ్రామ సర్పంచ్ మోరే రాజేశ్వరరావు, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు బలవంతుల రాజు, ఆర్టీఐ జిల్లా కన్వీనర్ ఎద్దులపురం శ్రవణ్ కుమార్, మాజీ జెడ్పీటీసీ టింగిలికారి సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి రవ్వ శివప్రసాద్, మండల ఉపాధ్యక్షులు పూజారి రవీందర్, పీసాల సాంబయ్య, కోశాధికారి జక్కుల మహేందర్, బూత్ అధ్యక్షులు యాద కుమార్, కుక్కమూడి కిరణ్, రాచర్ల నరేష్, బొల్లా రమేష్, కోరే కుమారస్వామి, మొద్దూరి పరమేశ్వర్‌తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటుకు 15 ఎకరాల స్థలం కేటాయింపు

రాష్ట్ర ప్రభుత్వానికి తీర్మాన పత్రం సమర్పించిన కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యులు



**హన్మకొండ, ఆగస్టు 18 ::** కాకతీయ విశ్వవిద్యాలయంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేసేందుకు 15 ఎకరాల స్థలం కేటాయించాలని కోరుతూ కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ మేరకు తీర్మాన పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించినట్లు పాలక మండలి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు చిర్ర రాజు గౌడ్, సుధాకర్, సుదర్శన్, డా.కే.అనిత రెడ్డి, రమా రెడ్డి, సురేష్ లాల్, భాలు చౌహాన్, నవీన్, సుకుమార్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ రామచంద్రం తదితరులు సెక్రటేరియట్‌లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కలిసి తీర్మానం వివరాలను అందించారు. విశ్వవిద్యాలయ పరిధిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటుకు 15 ఎకరాల స్థలం కేటాయిస్తే విద్యార్థులకు అత్యుత్తమ విద్యా వసతులు అందుబాటులోకి వస్తాయని వారు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ ప్రతిపాదనకు ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు, సహకారం అందేలా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యా రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు ప్రతిపాదనపై ప్రభుత్వ స్థాయిలో అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటుతో విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కొండగట్టు వద్ద ఆర్టీసీ బస్సు–లారీ ఢీ

- ప్రమాదంపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విచారం
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం

**హైదరాబాద్ ఆగస్టు18:** జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న ఘటనపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంపై జగిత్యాల జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి ఘటనకు గల కారణాలు, పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంతో పాటు ఘటనకు సంబంధించిన అంశాలను ఆర్టీసీ అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలని టీజీఎస్ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని ఆదేశించారు. ప్రమాదంపై సమగ్ర వివరాలు సేకరించి, బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

# కల్తీ ఖోవా అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్ – 174 కిలోల కల్తీ ఆహార పదార్థాలు స్వాధీనం

- జిల్లా టాస్క్ ఫోర్స్ ఇన్ స్పెక్టర్ అన్వర్ పాషా మరియు టీమ్ ఆధ్వర్యంలో




- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ఆదేశాల మేరకు

**తాండూరు, ఆగస్టు,18:** జిల్లాలో కల్తీ ఆహార పదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఇందులో భాగంగా జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా మరియు టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడిలో కల్తీ ఖోవాను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు నిర్వహించిన రైడ్‌లో రాజస్థాన్ రాష్ట్రం నాగౌర్ జిల్లా మక్రానా మండలం ఉంచెరియా గ్రామానికి చెందిన రుపారామ్ (36), S/o భేరురామ్, ప్రస్తుతం జహీరాబాద్ పట్టణంలోని పాష్తాపూర్ కాలనీలో నివాసం ఉంటున్న వ్యక్తి తన అతను ఆటోలో కల్తీ ఖోవాను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. అతని వద్ద నుంచి 160 కిలోల కల్తీ ఖోవా, 14 కిలోల కలకన్, మొత్తం 174 కిలోల ఆహార పదార్థాలను, సుమారు రూ.34,800/– విలువైనవి స్వాధీనం చేసుకున్నారు.ప్రజల ఆరోగ్యానికి హానికరమైన కల్తీ ఆహార పదార్థాలను తయారు చేయడం, రవాణా చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా అనుమానాస్పదంగా కల్తీ ఆహార పదార్థాల రవాణా లేదా విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి" అని అని టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ తెలిపినారు. స్వాధీనం చేసుకున్న కల్తీ ఆహార పదార్థాలు, ఆటో మరియు నిందితుడిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం తాండూర్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

## ప్రధాన రహదారులపై ఏర్పడిన గుంటలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని బిజెపి ధర్నా




**వలిగొండ ఆగస్టు 18 :**యాదాద్రి భువనగిరి జిల్లా భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో గుంతల మాయమైన రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలని మండల కేంద్రంలో ధర్నా నిర్వహించడం జరిగింది. వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి వెంట లోతైన గుంటలు ఏర్పడి, ప్రజలు, ప్రయాణికులు ప్రమాదాలకి గురవుతున్నారని. అందుకు తక్షణమే స్థానిక ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి రోడ్డు మీద పడిన గుంటలను వెంటనే పనులు చేపట్టాలని, లేనియెడల సంబంధిత శాఖ అధికారుల కార్యాలయాల వద్ద భారతీయ జనతా పార్టీ ముట్టడి చేపడుతుందని, అదేవిధంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కూడా ముట్టడిస్తామని వారు ఎమ్మెల్యే కి, స్థానిక అధికారులను హెచ్చరించారు. తక్షణమే ఈ రోడ్డుపై ఏర్పడిన గుంటలను పూడ్చని యెడల భారతీయ జనతా పార్టీ జిల్లా పార్టీ తరపున పెద్ద కార్యక్రమాన్ని తీసుకొని అడుగడుగునా ఎమ్మెల్యే ని అడ్డుకుంటామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, సీనియర్ నాయకులు నాయకులు బంధారపు లింగస్వామి, రాచకొండ కృష్ణ, రాస వెంకట్,బచ్చు శ్రీనివాస్, పాక పుల్లయ్య, బొడిగే ఆనంద్ , కందుల తానేష, మంద నరసింహ, రావుల పద్మారెడ్డి, మండల పదాధికారులు మందుల నాగరాజు, రంజిత్ రెడ్డి, దయాకర్, వెంకటేష్, శ్రీనివాస్, మహేష్ ,మండల నాయకులు వెంకటేష్, ఎర్రవోలు జంగయ్య, అరుణ్, మచ్చగిరి, అశోక్, లింగస్వామి వివిధ గ్రామాల నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాశీనాథ్ కుటుంబానికి ఆర్థిక సహాయం

### అసెంబ్లీ ఇంచార్జి యు రమేష్ బాబు ఆధ్వర్యంలో




**కొడంగల్ మున్సిపల్, ఆగస్టు,18:**
కొడంగల్ నియోజకవర్గ బహుజన్ సమాజ్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కాశీనాథ్ భార్య లివర్, జాండీస్ మరియు డెంగ్యూ వ్యాధులతో బాధపడుతూ ప్రస్తుతం హైదరాబాద్ లోని ఆస్పత్రిలో( ICU) లో చికిత్స పొందుతున్నా సందర్భంగా.ఆర్థిక ఇబ్బందులతో ఉన్న కాశీనాథ్ కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో BSP పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు మానవతా దృక్పథంతో స్పందించారు.ఇప్పటివరకు BSP పార్టీ నాయకులు, కార్యకర్తల నుండి మొత్తం ₹35,100/– ఆర్థిక సహాయం సమకూర్చి కాశీనాథ్ కు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ కొడంగల్ అసెంబ్లీ బీఎస్పీ నాయకుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొడంగల్ అసెంబ్లీ ఇంచార్జ్ యు రమేష్ బాబు కొడంగల్ అసెంబ్లీ అధ్యక్షులు శ్రీనివాస్ కొడంగల్ మండల నాయకులు అన్నారం సాయిలు కొడంగల్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు ఎం వెంకటేశం కొడంగల్ టౌన్ ఉపాధ్యక్షులు జి. అశోక్ బీఎస్పీ నాయకుడు హనుమంతు,తదితరులు పాల్గొన్నారు.

## హకింపేట లో చేపడుతున్న వివిధ భవన నిర్మాణ పనులను పరిశీలించి కలెక్టర్ దీపక్ తివారీ

**దుద్యాల మండలం,ఆగస్టు,18:**కొడంగల్ నియోజకవర్గం హకీంపేట్ నందు చేపడుతున్న వివిధ భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం దుద్యాల మండలం హకీంపేట్ లో చేపడుతున్నఎడ్యుకేషన్ హబ్ లో ప్రతి ఒక సైట్ ను అధికారులతో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలు, మౌలిక వసతుల కల్పనపై సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్, మెడికల్, నర్సింగ్, కళాశాల లు, ఫిజియోతెరఫీ, వెటర్నరీ కళాశాల, యుంగ్ ఇండియా ఇంటి గ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు వేగవంతం గా జరగాలని, నిర్మాణ పనులన్ని యు నాణ్యతో ఉండాలని, అదనంగా లేబర్ ను నియమించి పనులు వేగంగా జరిగేలా చూడాలని,ప్రతి వారం నిర్దారించిన లక్ష్యం మేరకు పనుల పురోగతి ఉండాలన్నారు. ప్రతి సైట్ ను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.నిర్మాణ పనులను వేగవంతం చేసి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. విద్యార్థులకు ఆధునిక విద్యా సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టిందని తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు.అనంతరం దుద్యాల మండలం ఇంటిగ్రెటెడ్ మండల కార్యాలయాల సముదాయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్,ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టుర్,కోడంగల్ కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఇ డబ్ల్యు ఐ డి సి విజయ భాస్కర్, ఇంజనీరింగ్ అధికారులు ,సంబంధిత అధికారులు ఉన్నారు.

## ఆగస్టు 20న ఉచిత కంటి వైద్య శిబిరం

### జనతా ట్రస్ట్ చైర్మన్ డా.గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

**నల్లబెల్లి/వరంగల్, ఆగస్టు 18 ::** మండల ప్రజల సౌకర్యార్థం జనతా ట్రస్ట్, శంకర ఐ ఫౌండేషన్ ఇండియా, శ్రీ కంచి కామకోటి మెడికల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 20న నల్లబెల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు జనతా ట్రస్ట్ చైర్మన్ డా.గోగుల రాణా ప్రతాప్ రెడ్డి తెలిపారు. నల్లబెల్లిలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. శిబిరంలో కంటి సంబంధిత సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి వైద్యుల సూచనల మేరకు చికిత్స, తదుపరి వైద్య సేవలకు మార్గదర్శనం అందించనున్నట్లు తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డుతో పాటు తమ వద్ద ఉన్న వైద్య పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు.

## పాఖాల ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలి

- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**
- **వెంటనే నీటిని విడుదల చేయాలని అధికారులకు ఆదేశాలు**



**నర్సంపేట, ఆగస్టు 18 ::** నియోజకవర్గంలోని పాఖాల సరస్సు ద్వారా ఆయకట్టు రైతులకు కాలువల ద్వారా వెంటనే సాగునీరు విడుదల చేయాలని కోరుతూ మంగళవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో సాగునీటి వనరుల్లో నీటిని నిల్వ ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ, పాఖాల ఆయకట్టు పరిధిలోని రైతులు ఇప్పటికే సుమారు 9 వేల ఎకరాలకు పైగా వరి నాట్లు వేసినట్లు ఎమ్మెల్యే మంత్రికి వివరించారు. ప్రస్తుతం నీటి కొరత ఏర్పడితే నాట్లు ఎండిపోయే పరిస్థితి ఉందని తెలిపారు. పాఖాల సరస్సులో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని కాలువల ద్వారా విడుదల చేసి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మంత్రిని కోరారు. ఆయకట్టు రైతుల పరిస్థితిని, పంటల అత్యవసర అవసరాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. పాఖాల ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేలా వెంటనే చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో పాఖాల ఆయకట్టు రైతులకు సాగునీరు అందే అవకాశం ఏర్పడటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంటలను కాపాడేందుకు ప్రభుత్వం స్పందించడంపై ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం చిరస్మరణీయం

### జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను.



**నారాయణపేట, ఆగస్టు,18:**
సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాజిక న్యాయం, సమానత్వం కోసం చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని నారాయణపేట జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను అన్నారు. మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్ లో జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు, గౌరవం కల్పించే దిశగా ప్రభుత్వాలు చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.డీ సీ రాజేందర్ గౌడ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, సూపరింటెండెంట్ అఖిల ప్రసన్న,గౌడ సంఘం నాయకులు సతీష్ గౌడ్, రఘురామయ్య, వెంకటేష్, గుర్నాథ్, కలాల్ ఆనంద్ గౌడ్, సర్పంచి శేఖర్ గౌడ్, ఉట్కూర్ మండలానికి చెందిన గౌడ సంఘం నాయకులు, కలెక్టరేట్ లోని వివిధ విభాగాల అధికారులు,ఉద్యోగులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## పథకాల నిర్వీర్యానికి కాంగ్రెస్ కుట్ర

- **ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు.**




**వలిగొండ ఆగస్టు 18 :**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి మాట్లాడుతూ తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, వీరత్వానికి ప్రత్యేకంగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సబ్బండ వర్గాల ప్రజలకు రాజకీయ సామాజిక సమానత్వం కోసం చేసిన కృషి మరచిపోలేనిదని కుల మతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలని సమసమాజ ప్రజాస్వామిక స్ఫూర్తితో మొగల్ చక్రవర్తుల కు వ్యతిరేకంగా పోరాడి గోల్కొండ కోటపై జెండా ఎగరవేసిన గొప్ప బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు బొడిగేసుదర్శన్, కొండూరు శ్రీరాములు, సత్తయ్య, పల్లెర్ల రామచందర్, గౌడ సంఘం అధ్యక్షుడు కొండూరు అంజయ్య, పాలకూర వెంకటేశం, పబ్బు సురేందర్, కంకల కిష్టయ్య, బత్తిని దేవేందర్, కొండూరు సాయి, శ్రీరాములు,బొడిగె సాయిలు, మునుకుంట్ల బిక్షపతి, కొండూరు సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు



**వలిగొండ ఆగస్టు 18 :**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను గౌడ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, వీరత్వానికి ప్రత్యేకంగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సబ్బండ వర్గాల ప్రజలకు రాజకీయ సామాజిక సమానత్వం కోసం చేసిన కృషి మరచిపోలేనిదని కుల మతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలని సమసమాజ ప్రజాస్వామిక స్ఫూర్తితో మొగల్ చక్రవర్తుల కు వ్యతిరేకంగా పోరాడి గోల్కొండ కోటపై జెండా ఎగరవేసిన గొప్ప బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి,గీత కార్మిక సంఘం అధ్యక్షుడు కొండూరు అంజయ్య, పబ్బు స్వామి గౌడ్, బత్తిని దేవేందర్ గౌడ్, మారగోని సత్యనారాయణ, రాగిర్ మధు, బత్తిని నరసింహ,బందరాపు లింగస్వామి, పబ్బు సురేందర్ , పంజాల రమేష్,కొండూరు వెంకన్న, శ్రీరాములు, పాలకూర్ల వెంకటేశం, మారగోని శ్రీనివాస్, బొడిగె సుదర్శన్, బత్తినిశేఖర్ ,బత్తిని శేట్టయ్య, కొండూరు సాయి, పబ్బు మల్లయ్య సత్తయ్య,తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక

### గురుకుల పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ

**మద్దూరు మండలం, ఆగస్టు,18:**



మద్దూరు మండల కేంద్రంలోని చింతల్ దిన్నె మార్గంలో రూ.30 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా అకాడమిక్ బ్లాక్, డైనింగ్ హాల్, ప్రిన్సిపాల్ క్వార్టర్స్, టాయిలెట్ బ్లాక్ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలకు వచ్చే ప్రధాన రహదారి విస్తరణ పనులపై మున్సిపల్ కమిషనర్ ను అడిగి తెలుసుకున్నారు.నిర్ణీత గడువు ప్రకారం నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. నిబంధనల ప్రకారం నవంబర్ నెలాఖరులోగా పనులు పూర్తి చేయాల్సి ఉందని, వచ్చే మార్చి నాటికి పాఠశాల నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు.అనంతరం మద్దూరు పట్టణ సమీపంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో రూ.6.10 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్, టాయిలెట్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించి, సెకండ్ ఫ్లోర్ స్లాబ్, ప్రహరీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. తరగతి గదుల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చురకలు



# అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి, కేంద్రంలో అందుతున్న సేవలను పరిశీలించారు



**మేడ్చల్ మల్కాజిగిరి ఆగస్టు 18:**ఈ సందర్భంగా కేంద్రంలోని మౌలిక వసతులు, పరిశుభ్రత, పిల్లల హాజరు, పోషకాహార పంపిణీ, ఆరోగ్య సేవలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న భోజనం నాణ్యత-పరిమాణంతో పాటు, కేంద్రంలో సరిపడా ఆహార నిల్వలు ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. బియ్యం, పప్పులు, కూరగాయలు తదితర నిర్దేశిత ఆహార పదార్థాల నిల్వలను పరిశీలించడంతో పాటు, గుడ్లు, మరియు ఇతర పోషకాహార పదార్థాలు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి, ఆహార పదార్థాల నాణ్యత, గడువు తేదీలను కూడా తనిఖీ చేశారు. అదేవిధంగా, పిల్లల ఆరోగ్య పరిస్థితి, ఎదుగుదల, పోషకాహార స్థితిపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ముఖ్యంగా సామ్-మామ్ పిల్లలు ఎంతమంది ఉన్నారు, వారికి అందుతున్న చికిత్స, పోషకాహారం మరియు ఫాలోఅప్ ఎలా జరుగుతోంది అనే వివరాలను అంగన్‌వాడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు నిరంతర పర్యవేక్షణ, వైద్య సేవలు అందేలా చూడాలని సూచించారు. పిల్లల ఆరోగ్య సేవలకు సంబంధించిన రికార్డులు, పోషణ్ కార్యక్రమాల అమలు, ఆరోగ్య పరీక్షలు, టీకాలు తదితర వివరాలను కూడా డా. కె. ఆనంద్ పరిశీలించారు. ప్రతి చిన్నారి ఆరోగ్యం,పోషకాహారం మరియు ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు నాణ్యతతో ఉండేలా చూడాలని డా. కె. ఆనంద్ సిబ్బందికి సూచించారు.

# రేపు విద్యుత్ ఉద్యోగుల మహాధర్నా

**దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**



**హైదరాబాద్, ఆగస్టు 18:**తెలంగాణ రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 19న హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధలో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ (TGPEJAC) ప్రకటించింది. విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్ రావు, సెక్రటరీ జనరల్ శ్రీధర్, కో-కన్వీనర్ బి.సి. రెడ్డి, వైస్ చైర్మన్లు మహేష్, వజీర్ పిలుపునిచ్చారు. ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంల యాజమాన్యాలతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జూన్ 18న లేఖ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదని జేఏసీ నాయకులు తెలిపారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం బేషరతుగా చర్చలకు ఆహ్వానించి, సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇస్తే ధర్నాను విరమించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎలాంటి నిబంధనలు, బెదిరింపులకు లొంగకుండా న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యోగులు ఐక్యంగా మహాధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడి రమేష్, సదానందం, తాజుద్దీన్ బాబా, భూపాల్ రెడ్డి, ఈశ్వర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, సురేష్ కుమార్, విద్యాసాగర్, వెంకటేశ్వర్లు, భాస్కరరావు, వెంకటేష్, యుగంధర్, అశోక్ కుమార్, రాజేంద్రప్రసాద్, అనిల్ కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# త్యాగాల తెలంగాణలో.. ఉద్యమ యోధుడి విగ్రహానికే అవమానమా?...

- **పెద్దన్న విగ్రహం కాదు.. ఒక ఉద్యమ జ్ఞాపకాన్ని తొలగించారు!**
- **అర్ధరాత్రి 'పెద్ది' విగ్రహం తొలగించడం ప్రజా స్వామ్యానికి చీకటి రోజులు... తక్కలపల్లి రవీందర్ రావు**



**నర్సంపేట/వరంగల్, ఆగస్టు 18 ::** ఉద్యమ త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో తెలంగాణ ఉద్యమ యోధుడు, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని అర్ధరాత్రి భారీ పోలీసు బందోబస్తు మధ్య తొలగించడం ప్రజల్లో అనేక ప్రశ్నలకు తావిస్తోందని బీఆర్ఎస్ నర్సంపేట డివిజన్ కోఆర్డినేటర్, ఖానాపురం మాజీ ఎంపీపీ, మాజీ సొసైటీ చైర్మన్ తక్కలపల్లి రవీందర్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఎవరి దయాదాక్షిణ్యాలతోనో ఏర్పడలేదని, ఎన్నో ఏళ్ల ఉద్యమాలు, పోరాటాలు, ఎందరో ఉద్యమకారుల త్యాగాలు, రక్తం, చెమటతో రాష్ట్రం సాధించుకున్నామని ఆయన పేర్కొన్నారు. అలాంటి తెలంగాణలో ఉద్యమ యోధుడి విగ్రహాన్ని అర్ధరాత్రి తొలగించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో ప్రభుత్వం, అధికారులు ప్రజలకు స్పష్టంగా వివరించాలని డిమాండ్ చేశారు. నర్సంపేట ప్రాంతానికి మెడికల్ కాలేజీ, 200 పడకల ఆసుపత్రి వంటి కీలకమైన వైద్య సదుపాయాలు రావాలని అప్పటి ప్రభుత్వంతో పోరాడి, ప్రజల కోసం పట్టుబట్టిన పెద్ది సుదర్శన్ రెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన విగ్రహంపై ఇలాంటి చర్య అవసరమా అని ప్రశ్నించారు. ఒక ఉద్యమ యోధుడిని స్మరించుకోవడం తప్పా? విగ్రహం ఏర్పాటు చేయడం అంత పెద్ద నేరమా? అని నిలదీశారు. విగ్రహం విషయంలో ఏవైనా అభ్యంతరాలు లేదా చట్టపరమైన సమస్యలు ఉంటే పగటి పూట ప్రజల ముందు చర్చించి, చట్టపరమైన మార్గంలో పరిష్కరించవచ్చని అన్నారు. అయితే అర్ధరాత్రి అరెస్టులు, భారీ పోలీసు బందోబస్తు, అనంతరం విగ్రహం తొలగింపు వంటి పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థపై సహజంగానే ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయని పేర్కొన్నారు. విగ్రహం తొలగించాల్సిన అత్యవసరం ఏమిటి? ఎవరిపై ఏ అభియోగాలు ఉన్నాయి? ప్రజలతో చర్చించకుండా అర్ధరాత్రి చర్య ఎందుకు చేపట్టారు? అనే అంశాలపై ప్రభుత్వం, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని రవీందర్ రావు డిమాండ్ చేశారు. రాజకీయ విభేదాలు, పార్టీలు, ప్రభుత్వాలు మారవచ్చని, పదవులు శాశ్వతం కావని అన్నారు. కానీ చరిత్రను అధికారంతో మార్చలేరని, ప్రజల జ్ఞాపకాలను పోలీసు బలంతో చెరిపేయలేరని వ్యాఖ్యానించారు. గద్దె కూల్చితే చరిత్ర కూలదు.. విగ్రహం తొలగిస్తే గౌరవం తొలగదు.. కేసులు పెడితే ఉద్యమ స్ఫూర్తి ఆగదని అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఉద్యమ ప్రస్థానం, ప్రజా సేవ, తెలంగాణ కోసం చేసిన పోరాటాన్ని గౌరవించడం ఒక రాజకీయ పార్టీకి మాత్రమే సంబంధించిన అంశం కాదని, ఉద్యమ యోధుల చరిత్రను గౌరవించడం తెలంగాణ సమాజం బాధ్యత అని పేర్కొన్నారు. అధికారం ప్రజల కోసం ఉపయోగించాలే తప్ప ప్రజల జ్ఞాపకాలను అణచివేయడానికి కాదని అన్నారు. విగ్రహం విషయంలో ఏవైనా చట్టపరమైన అంశాలు ఉంటే వాటిని పారదర్శకంగా ప్రజలకు వెల్లడించి, వివాదానికి ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కారం చూపాలని కోరారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పోరాట చరిత్రను ఎవరూ తొలగించలేరని, ఆయనపై ప్రజల్లో ఉన్న గౌరవాన్ని ఎవరూ ఆదేశాలతో చెరిపేయలేరని రవీందర్ రావు అన్నారు. ఉద్యమ యోధులకు గౌరవం ఇవ్వాలని, తెలంగాణ చరిత్రను గౌరవించాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

# గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఫిలిప్పీన్స్ మైగ్రేషన్ విధానంపై తెలంగాణ బృందం అధ్యయనం

- **ఫిలిప్పీన్స్ తరహాలో తెలంగాణ వలస విధానానికి ప్రణాళిక**
- **మనీలాలో ఉన్నతస్థాయి సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి**



**మనీలా, ఆగస్టు 18:**

గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న తెలంగాణ కార్మికుల సంక్షేమానికి సమగ్ర విధానం రూపొందించే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ బృందం ఫిలిప్పీన్స్‌లో మూడు రోజుల అధ్యయన పర్యటన చేపట్టింది. ఇందులో భాగంగా మంగళవారం రాజధాని మనీలాలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో బృందం పాల్గొంది. ప్రపంచంలో మెరుగైన మైగ్రేషన్ విధానాలను అమలు చేస్తున్న దేశాల్లో ఫిలిప్పీన్స్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని, అక్కడి విధానాలను అధ్యయనం చేసి తెలంగాణ పరిస్థితులకు అనుగుణంగా గల్ఫ్ కార్మికుల సంక్షేమ పాలసీ రూపకల్పనకు నివేదిక సిద్ధం చేయనున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి తెలిపారు. తెలంగాణ నుంచి సుమారు 15 లక్షల మంది గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వలస వెళ్లిన నేపథ్యంలో వారి సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా 'తెలంగాణ గల్ఫ్ ఎన్నారై పాలసీ', 'గల్ఫ్ అండ్ అదర్ ఓవర్సీస్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు' ఏర్పాటుకు అవసరమైన అంశాలను అధ్యయనం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఫిలిప్పీన్స్ లేబర్ మైగ్రేషన్ గవర్నెన్స్, సివిల్ సొసైటీ సంస్థల పాత్ర, వలస కార్మికుల సంక్షేమం, గ్లోబల్ మైగ్రేషన్ యాక్షన్ ప్లాన్, లేబర్ మైగ్రేషన్ కారిడార్ అనుభవాలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. పర్యటనలో తెలంగాణ రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ అంబాసిడర్ డా. బీ.ఎం. వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, నంగి దేవేందర్, స్వదేశ్ పరికిపండ్ల, ప్రొఫెసర్లు విజయ్ కొర్ర, జునుగూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో వేళ ప్రతి నీటి చుక్కకూ లెక్క ఉండాలి

**తాగునీటికే తొలి ప్రాధాన్యం.. పంటలకూ భరోసా: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**హైదరాబాద్, ఆగస్టు 18:**ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి ఆధారంగానే విడుదల నిర్ణయాలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తాగునీటికి తొలి ప్రాధాన్యం ఇస్తూనే ఖరీఫ్ పంటలను కాపాడాలని జలసౌధలో జరిగిన సమీక్షలో సూచించారు. కృష్ణా బేసిన్‌లో 76.63 శాతం, గోదావరి బేసిన్‌లో 68.1 శాతం నీటి నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. నాగార్జునసాగర్‌లో సుమారు 164 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు వెల్లడించారు. సింగూరు డ్యామ్ మరమ్మతులను వేగవంతం చేయడంతో పాటు అంతర్రాష్ట్ర జల వివాదాలపై పటిష్ట వాదనకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు.

## ఇందిరమ్మ ఇళ్లకు రూ.230కే సిమెంట్ బస్తా



**హైదరాబాద్, ఆగస్టు 18:**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సిమెంట్ బస్తాను రూ.230కే అందించేందుకు సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలు అంగీకరించాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం సచివాలయంలో పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమై ధర తగ్గించాలని కోరారు. రాష్ట్రంలో తొలి విడతలో 4.50 లక్షలు, రెండో విడతలో సుమారు 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. పేదల గృహ నిర్మాణంలో భాగస్వాములై తక్కువ ధరకు సిమెంట్ అందించేందుకు ముందుకొచ్చిన పరిశ్రమల యాజమాన్యాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- **మార్చి 2027 నాటికి**
- **జూనియర్ కళాశాల భవనం పూర్తి చేయాలి.**
- **నిర్మాణ పనుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి.జిల్లా కలెక్టర్ ప్రియాంకా..**

**గుండుమాల్ మండలం, ఆగస్టు,18:**

గుండుమల్,కోస్గి మండలలలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి, నిర్మాణ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ ప్రియాంక పరిశీలించారు.గుండుమల్‌లో రూ.5.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. మొదటి అంతస్తు స్లాబ్ పనులు పూర్తికాగా, రెండో అంతస్తు స్లాబ్ పనులు కొనసాగుతున్నట్లు అధికారులు వివరించారు. మార్చి 2027 నాటికి పనులు పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరం నుంచే జూనియర్ కళాశాలను నూతన భవనంలో నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.గుండుమాల్ మండలంలో కొనసాగుతున్న ఇతర నిర్మాణ పనులపై కలెక్టర్ ఆరా తీశారు. హాస్టల్, జూనియర్ కళాశాల, మండల కార్యాలయాల సముదాయం తదితర నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు.పాత ఎస్సీ బాలుర వసతి గృహం వెనుక రూ.1.40 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నూతన ఎస్సీ వసతి గృహాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. మొదటి అంతస్తు స్లాబ్ పనులు పూర్తి కాగా, నిర్మాణ పనులను రెండు నెలల్లోగా పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.మండల కార్యాలయాల సముదాయం, ఎస్సీ వసతి గృహం, ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ ప్రదేశాల్లో పనులు జరుగుతున్న సమయంలో సిబ్బంది ఎవరూ ఉండటం లేదని తాను ఈ మార్గంలో వెళ్తున్న సమయంలో గమనించినట్లు కలెక్టర్ తెలిపారు. అవసరమైతే నిర్మాణ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.అనంతరం గుండుమల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో రూ.8.80 కోట్లతో కొనసాగుతున్న మండల కార్యాలయాల సముదాయం నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటికే మంజూరైన నిధుల్లో రూ.8 కోట్లకు పైగా ఖర్చు కాగా, పనుల పూర్తికి అదనంగా మరో రూ.2 కోట్లు అవసరమని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అదనపు నిధులు మంజూరైతే ఎప్పటిలోగా పనులు పూర్తి చేస్తారో అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

**పంచాయతీరాజ్ రోడ్ల పై ఆరా..**

కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని మద్దూరు, కొత్తపల్లి, గుండుమల్, కోస్గి మండలాల్లో పంచాయతీరాజ్ రోడ్ల గురించి జిల్లా కలెక్టర్ ఆరా తీయగా.. ఆయా నాలుగు మండలాల్లో పీ ఆర్ రోడ్ల నిర్మాణాలకు మొత్తం రూ.456 కోట్లు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఈఈ అశోక్ కుమార్ తెలిపారు. బ్రిడ్జిలు, కల్వర్టులతో కూడిన మల్టీ కనెక్టెడ్ రోడ్ల నిర్మాణానికి అదనంగా రూ.417 కోట్ల ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. మొత్తం 97 పనుల్లో 48 పనులకు అదనపు అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు ఈఈ కలెక్టర్‌కు తెలిపారు. రోడ్లు, భవనాలు, ఇతర అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.కోస్గి మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఇచ్చిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆమె అధికారులకు సూచించారు.ఈకార్యక్రమంలో టీజీ డబ్ల్యు ఐ డిసి విజయభాస్కర్ రెడ్డి,అర్ అండ్ బి ఈఈ శ్రీధర్ రెడ్డి,మద్దూరు, కోస్గి మున్సిపల్ కమిషనర్లు శ్రీకాంత్,నాగరాజు,కోస్గి మున్సిపల్ చైర్మన్ నాగులపల్లి నరేందర్,ఎంపిడిఓ శ్రీధర్,తహసీల్దార్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

# ఏటీసీల్లో వచ్చే ఏడాది నుంచి స్కిల్ కాంపిటేషన్స్

టాప్-10 ఇన్నోవేటర్లకు ఉద్యోగాలు, ప్రోత్సాహకాలు
మణుగూరు ఏటీసీ విద్యార్థుల ప్రతిభను అభినందించిన మంత్రి వివేక్ వెంకటస్వామి
కార్లు తయారు చేసిన పార్థసారథి, స్ఫూర్తికి ప్రశంసా పత్రాలు అందజేత
ఇద్దరినీ ఏటీసీ విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని మంత్రి సూచన
ఏటీసీలో శిక్షణతో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు మంత్రి చేతులమీదుగా నియామక పత్రాలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దూరదృష్టితో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీలు) యువతకు కేవలం ఉద్యోగ శిక్షణ అందించే కేంద్రాలుగా కాకుండా.. వారిలోని సృజనాత్మకతను వెలికితీసి ఇన్నోవేటర్లుగా తీర్చిదిద్దే వేదికలుగా మారుతున్నాయని శక్తి (కార్మిక, ఉపాధి, శిక్షణ & ఫ్యాక్టరీస్) మరియు గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఏటీసీల్లో రెండేళ్ల శిక్షణతోనే విద్యుత్ వాహనాలను తయారు చేయడం రాష్ట్రంలోని నైపుణ్య శిక్షణ వ్యవస్థకు నిదర్శనమని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను మంత్రి మంగళవారం సందర్శించారు. ఏటీసీ విద్యార్థులు పార్థసారథి, స్ఫూర్తి రూపొందించిన వినూత్న విద్యుత్ వాహనాలను పరిశీలించి వారి ప్రతిభను అభినందించారు. విద్యార్థులతో మాట్లాడి ఆవిష్కరణలకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మణుగూరు ఏటీసీలో శిక్షణ పూర్తి చేసి వివిధ సంస్థల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. రాష్ట్రంలోని ఏటీసీల్లో చదివే ప్రతి విద్యార్థికి నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన స్కిల్ సెట్లను యువతకు అందిస్తూ.. మరోవైపు విద్యార్థుల్లోని సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఏటీసీల్లో శిక్షణ పొందిన విద్యార్థులు ఉద్యోగాలకే పరిమితం కాకుండా కొత్త ఆవిష్కరణలు చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మణుగూరు ఏటీసీ విద్యార్థుల ఆవిష్కరణలు ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలో ఏర్పాటయ్యే 119 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో ప్రతి ఏటా స్కిల్ కాంపిటీషన్ నిర్వహిస్తామని మంత్రి ప్రకటించారు. ఏటీసీల మధ్య పోటీలు నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచే ఇన్నోవేటర్లను గుర్తిస్తామని తెలిపారు. టాప్?10లో నిలిచే ఇన్నోవేటర్లకు ప్రత్యేక అవార్డులు, ప్రోత్సాహకాలు అందించడంతో పాటు ఏటీసీల్లోనే ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థులు తమ ఆలోచనలను ఆవిష్కరణలుగా మార్చి ప్రపంచస్థాయిలో పోటీపడేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. పదో తరగతి తర్వాత ఏటీసీలో చేరిన విద్యార్థులు కేవలం రెండేళ్లలోనే విద్యుత్ వాహనాలను అభివృద్ధి చేయడం తనను ఎంతగానో ఆకట్టుకుందని మంత్రి అన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని సాంకేతిక విద్యాసంస్థల్లో ఇలాంటి ఆవిష్కరణలు దరావడం గర్వకారణమన్నారు. విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలను కేవలం ప్రదర్శనలకే పరిమితం చేయకుండా వాణిజ్య స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. విద్యుత్ వాహనాలను మరింత అభివృద్ధి చేసి మార్కెట్‌లోకి తీసుకెళ్లేందుకు అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు. విద్యార్థులు మరింత మెరుగైన నమూనాలను అభివృద్ధి చేయాలని సూచించారు. అవసరమైన నిధుల కోసం ప్రభుత్వ సహకారం అందిస్తామని తెలిపారు. తక్కువ వ్యయంతో తయారు చేస్తున్న విద్యుత్ వాహనాలకు మార్కెట్ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 119 ఏటీసీలను టాటా సంస్థ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. తెలంగాణలో టాటా సంస్థ సుమారు రూ.4 వేల కోట్ల పెట్టుబడితో సాంకేతిక శిక్షణ కేంద్రాల అభివృద్ధికి సహకరిస్తోందని చెప్పారు.



## మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మురళి నాయక్



మహబూబాబాద్: ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వెన్నెల తల్లి పిల్లల ఆసుపత్రి డా. జ్యోత్స్న రెడ్డి గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళి నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ విద్యార్థినులు ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో రాణించగలరని అన్నారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అభినందనీయమన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థినులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య సూచనలు అందిస్తున్న డా. జ్యోత్స్న రెడ్డి మరియు వెన్నెల తల్లి పిల్లల ఆసుపత్రి యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు.విద్యార్థినులు తమ ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా అవసరమైనప్పుడు వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి వైద్య శిబిరాలు మరిన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారి వెంట మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ గుగులోత్ జ్యోతి రమేష్,స్థానిక వార్డు కౌన్సిలర్ బోడ రవి, కౌన్సిలర్లు బొళ్ల రాజు, చిర్రల అరుణ జ్ఞానేశ్వర్ ,పాఠశాల ఉపాధ్యాయులు, జిల్లా నాయకులు, పట్టణ నాయకులు కార్యకర్తలు,వైద్య సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.
గిరి రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా మారిన రేవంత్ రెడ్డి..

## పేదల భూములపై పడి కీచకుల్లా వ్యవహరిస్తున్న సర్కార్

'ధరణి' పోయినా ధోరణి మారలేదు..
'భూభారతి' కాస్త 'పేదల పాలిట 'భూహారతి'గా మారింది
హైడ్రా, పోలీసుల పహారాలో రాత్రికి రాత్రే పేదల భూములకు ఫెన్సింగ్ వేసి వేలానికి కుట్ర
కూకట్‌పల్లిలో రూ.20,000 కోట్ల ఎఙఇ/గల్ఫ్ ఆయిల్ భూముల బదిలీ వెనుక ఫినిక్స్ కంపెనీ దందా
పేదలు, రైతుల భూములను లాక్కుంటే చూస్తూ ఊరుకోం..
కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తాం



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల భూములను కాపాడాల్సింది పోయి, రియల్ ఎస్టేట్ బ్రోకర్ తరహాలో వ్యవహరిస్తూ లక్షల కోట్ల రూపాయల భూదందాకు తెరతీసిందని బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ధరణి పోయినా ధోరణి మారలేదు తెలంగాణ వస్తే భూ సమస్యలన్నీ తీరి పారదర్శకమైన చట్టం వస్తుందని ప్రజలు ఆశిస్తే, గత కేసీఆర్ ప్రభుత్వం ధరణి పేరుతో పేద రైతుల హక్కులను కాలరాసిందని ఈటల విమర్శించారు. ధరణి రాకముందు పహాణీలో ఉన్న 13 కాలమ్స్ (ముఖ్యంగా కబ్జా, కాస్తు కాలమ్స్) తొలగించడం వల్ల 50-70 ఏళ్లుగా భూములను సాగుచేసుకుంటున్న దళితులు, గిరిజనులు, బీసీ పేద రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పి, ఇప్పుడు 'భూభారతి' పేరుతో మరింత దారుణంగా పేద రైతాంగాన్ని అగాధంలోకి నెట్టిందని.. 'ధరణి పోయినా ధోరణి మారలేదు, భూభారతి కాస్త పేదలకు భూహారతిగా మారింది' అని ఎద్దేవా చేశారు. హైడ్రా, పోలీసుల పహారాలో రాత్రికి రాత్రే భూముల కబ్జా:కేసీఆర్ కంటే రేవంత్ రెడ్డి పది అడుగులు ముందుకేసి భూముల వేలం ద్వారా దాదాపు రూ.10 లక్షల కోట్లు సమకూర్చుకోవాలనే దుర్మార్గపు ఆలోచనతో ఉన్నారని ఈటల మండిపడ్డారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని నగర విస్తరణ ప్రాంతాల్లో వేల ఎకరాల పేదల భూములను హైడ్రా, వందల మంది పోలీసుల పహారాలో రాత్రికి రాత్రే ఫెన్సింగ్‌లు, గోడలు కట్టి బిల్డర్లకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు గ్రామాలపై పడి కీచకుల్లా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో సాగుతున్న ప్రైవేట్ భూముల్లో 12 ఏళ్ల కౌలు ఉంటే 'సెక్షన్ 38ఇ' కింద హక్కులు వస్తుంటే.. బడంగ్‌పేట్‌లో ఐదు తరాలుగా (78 సంవత్సరాలుగా) 4గీ మంది రైతులు సాగుచేసుకుంటున్న 45 ఎకరాల 1గీ గంటల భూమిని ప్రభుత్వ భూమి పేరుతో లాక్కుంటున్నారు.దుండిగల్ & బోరంపేట: దుండిగల్ సర్వే నం. 452, 453లోని 400 ఎకరాల్లో 500 మంది రైతులు, బోరంపేట సర్వే నం. 1గీలోని 440 ఎకరాల్లో 150 మంది రైతులు 80 ఏళ్లుగా సాగు చేసుకుంటుంటే బలవంతంగా గుంజుకుంటున్నారు. బోరంపేట సర్వే నం. 472లోని 30 ఎకరాలకు ప్రీకాస్ట్ గోడలు నిర్మించారు.బొమ్మరాజుపేట (శామీర్‌పేట్): 19గీ5 నాటి 1,049 ఎకరాల భూమి ధరణి లోపాల వల్ల వివాదంలోకి వెళ్లగా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక 24 గంటల్లోనే పేర్లు మార్చి రియల్ ఎస్టేట్ మాఫియాకు అప్పగించారు. శంషీగూడా (ఎల్లమ్మబండ): సర్వే నం. 57లోని 333 ఎకరాల్లో పేదలు, జర్నలిస్టులకు ఇచ్చిన 17గీ ఎకరాలు కాకుండా మిగిలిన 90 ఎకరాల భూమిని (విలువ సుమారు రూ.3,000 కోట్ల నుండి రూ.4,000 కోట్లు) కోర్టు కేసులను అడ్డం పెట్టుకుని ప్రైవేట్ వ్యక్తులతో సెటిల్‌మెంట్ చేసుకుని దోచుకుంటున్నారు.కూకట్‌పల్లి (గల్ఫ్ ఆయిల్ / ఎఙఇ భూములు): గతంలో ఇండియన్ డిటనేటర్స్ లిమిటెడ్ (ఎఙఇ) పేరిట ఉన్న 330 ఎకరాల పైచిలుకు భూమిని (విలువ రూ.20,000 కోట్లు) ఫినిక్స్ కంపెనీ మధ్యవర్తిత్వంతో చేతులు మార్చారు. ఇక్కడ నుంచే 2021 హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అక్రమ డబ్బు ఖర్చు పెట్టిందని, ప్రస్తుతం ఇక్కడ ఒక్కో విల్లాను రూ.25 కోట్ల నుండి రూ.30 కోట్లకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు.బహదూర్ గూడ (ఫ్యూచర్ సిటీ): 70-80 ఏళ్లుగా గులాబీ తోటలు సాగుచేసుకుంటున్న రైతుల నుంచి గీ50 ఎకరాలను హైడ్రా బలగాలతో లాక్కోవాలని చూస్తే, ప్రజలు కారప్పొడి చల్లి తిరుగుబాటు చేశారని గుర్తు చేశారు.

## కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన

# చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోవాలి

.వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి.
టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వనపర్తి కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీపై రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై తక్షణమే స్పందించి, సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ని కలిసి ఫిర్యాదు చేశారు.ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, నియోజకవర్గంలోని ఏనిమిది మండలాల పార్టీ అధ్యక్షులు పట్టణ అధ్యక్షులు, మార్కెట్ యార్డు చైర్మన్, వైస్ చైర్మన్, సర్పంచులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్దలు అధిక సంఖ్యలో గాంధీ భవన్‌కు చేరుకుని టీపీసీసీ అధ్యక్షులను కలిసి తమ అభ్యంతరాలను తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.కాంగ్రెస్ పార్టీ తమకు కేవలం ఒక రాజకీయ పార్టీ కాదని, కన్నతల్లి లాంటి పార్టీ అని పేర్కొన్నారు.అలాంటి పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా మాట్లాడటం ఏమాత్రం సమంజసం కాదన్నారు.అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని నిందించే విధంగా వ్యాఖ్యలు చేయడం, కాంగ్రెస్ పార్టీ డబ్బులకు అమ్ముడుపోయిందని చేసినటువంటి వ్యాఖ్యలు పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడి పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తల మనోభావాలను ఇలాంటి వ్యాఖ్యలు తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు.పార్టీకి నష్టం కలిగించేలా, కార్యకర్తల మనోభావాలను కించపరిచేలా ఎవరైనా మాట్లాడితే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి క్రమశిక్షణాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కోరారు. పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో నాయకుల మధ్య విభేదాలు సృష్టించేలా, కార్యకర్తలను నిరుత్సాహపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.ఎమ్మెల్యే ఫిర్యాదుపై టీపీసీసీ అధ్యక్షుల సానుకూల స్పందన.వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మరియు వనపర్తి జిల్లా కాంగ్రెస్ నాయకులు చేసిన ఫిర్యాదుపై టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించారు.చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలపై తగిన విచారణ చేపట్టి, పార్టీ పెద్దలతో చర్చించిన అనంతరం అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని, ముఖ్యమంత్రి ని నిందించడం, పార్టీ డబ్బులకు అమ్ముడుపోయిందని ఆరోపించడం వంటి అంశాలను పార్టీ నాయకత్వం తీవ్రంగా పరిగణిస్తుందని ఆయన పేర్కొన్నారు. పార్టీలో ప్రతి నాయకుడికి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసే హక్కు ఉన్నప్పటికీ, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా, పార్టీ నాయకత్వాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం మాత్రం ఆమోదయోగ్యం కాదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. పార్టీ క్రమశిక్షణను కాపాడుతూ, కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు, కార్యకర్తల మధ్య ఐక్యతే పార్టీకి ప్రధాన బలమని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీపై, ముఖ్యమంత్రి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై అధిష్టానం తగిన చర్యలు తీసుకుంటుందన్న విశ్వాసం తమకు ఉందని వనపర్తి జిల్లా కాంగ్రెస్ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, మండలాల, పట్టణాల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ యార్డు పాలకవర్గం, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సర్వాయి పోరాటం స్ఫూర్తిదాయకం: కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం స్ఫూర్తిదాయకమని ఆయన ఆశయాలను అందరం కొనసాగిద్దామని కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సర్వాయి పాపన్న 37గీ వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అధికారులు, బీసీ, గౌడ సంక్షేమ సంఘం నాయకులు సర్వాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కల్లు గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్మికులకు ఎక్స్ గ్రేషియా, కాటమయ్య రక్షణ కిట్లు అందిస్తున్నట్లు వివరించారు. సంఘం నాయకులతో మాట్లాడుతూ. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.ఐక్యం గా పని చేస్తూ నియోజక వర్గాల వారీగా నెలకొన్న సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.చదువు, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. తమ సంఘంలో బాలికల చదువుకు పెద్దపీట వేసి వారు ఉన్నత స్థానాల్లో నిలిచేలా కృషి చేయాలన్నారు.ఎక్సైజ్ శాఖ సమన్వయంతో జిల్లాలోని 3412 మంది కల్లుగీత కార్మికులకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కరీంనగర్ 4గీ3, మానకొండూర్ 933, చొప్పదండి 975, హుజురాబాద్ 1041 కాటమయ్య సేఫ్టీ కిట్లు అందించినట్లు పేర్కొన్నారు. నగరపాలిక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ. జనగాం జిల్లాలో ఆయన నిర్మించిన కోట ఇప్పటికీ బ్రహ్మాండంగా ఉందన్నారు. ఆ మహనీయుడు ఆశయాలను, జీవన విధానం, దూరదృష్టి నేటి తరానికి తెలియజేయాలని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పాపన్నలాంటి వీరులు అన్ని వర్గాలకు స్ఫూర్తి, ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్ఓ స్వామి, బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, వివిధ శాఖల అధికారులు, తెలంగాణ గౌడ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర గౌడ సంఘం నాయకులు పడాల స్వామి, గౌడ పులి ఆంజనేయులు గౌడ్, పడాల అజయ్ గౌడ్, దూలం అంజన్న గౌడ్, తాళ్లపల్లి ఎల్లాగౌడ్, మాచర్ల ఆంజనేయులు గౌడ్ , బుర్ర ముత్తయ్య గౌడ్, సాగర్ గౌడ్ నరసయ్య గౌడ్, రాజు గౌడ్, రమేష్ గౌడ్,మహిళా నాయకులు సుజాత గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## కె. కేశవరావు అధ్యక్షతన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం

హైదరాబాద్ : తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కె. కేశవరావు అధ్యక్షతన ఆయన నివాసంలో ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ నేపథ్యంలో కమిటీ ఇప్పటికే వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థి ఉద్యమకారులు, కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు, ప్రజాసంఘాలు మరియు సమాజంలోని సబ్బండ వర్గాల ప్రతినిధులతో పలు దఫాలుగా సంప్రదింపులు జరిపింది.

## బిజినెస్

### కోరం లేక టాటా సన్స్ ఏజీఎం వాయిదా.. వందేళ్లలో తొలిసారి




ప్రముఖ వ్యాపార సంస్థ టాటా సన్స్ ఏజీఎం (యాన్యువల్ జనరల్ మీటింగ్) వాయిదా పడింది. తగినంత కోరం లేకపోవడంతో ఏజీఎం వాయిదా పడింది. ఆగష్టు 18, మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు బాంబే హౌజ్‌లో ఏజీఎం జరగాల్సి ఉంది. టాటా సన్స్ సంస్థ 1917లో ఏర్పాటుకాగా, వందేళ్లలో ఇలా ఏజీఎం వాయిదా పడటం ఇదే మొదటిసారి. ఏజీఎంకు ప్రస్తుత టాటా సన్స్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ ప్రత్యక్షంగా హాజరయ్యారు. ఆయన త్వరలోనే ఈ బాధ్యతల నుంచి తప్పుకోనున్న సంగతి తెలిసిందే. ఆయనతోపాటు సౌరభ్ అగర్వాల్, అనితా మారంగోలి నేరుగా హాజరుకాగా.. మరికొందరు వర్చువల్‌గా హాజరయ్యారు. ఇక, కోరం లేకపోవడానికి ప్రధాన కారణం టాటా సన్స్‌లో సభ్యత్వం ఉన్న సర్ రతన్ టాటా ట్రస్ట్ (ఎస్ఆర్‌టీటీ)తోపాటు, సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ తరఫున సభ్యులు లేకపోవడమే. ఈ రెండు ట్రస్టుల నుంచి సభ్యుల్ని ప్రతిపాదించాల్సి ఉంది. కానీ, ఇటీవల ఈ ట్రస్టులను పర్యవేక్షించే ప్రభుత్వ అథారిటీ అయిన 'ద మహారాష్ట్ర చారిటీ కమిషనర్' విధించిన రెగ్యులేటరీ నిబంధనల వల్ల సభ్యుల్ని నామినేట్ చేయలేదు. సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ కూడా ఈ విషయాన్ని ముందే తెలిపింది. రెండు ట్రస్టుల తరఫున ఉమ్మడి సభ్యుడు బోర్డులో లేకపోవడంతో కోరమ్ సరిపోలేదు. దీంతో ఏజీఎం వాయిదాపడింది. అయితే, ఈ విషయం టాటా సన్స్ సభ్యులుగా ముందుగానే అవగాహన ఉందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. టాటా సన్స్ సంస్థ ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ ప్రకారం కంపెనీ కార్పొరేట్ వ్యవహారాలపై నిర్ణయం తీసుకోవాలంటే ఏజీఎంలో తగిన కోరమ్ ఉండాల్సిందే. ఇండియాస్ కంపెనీ యాక్ట్ ప్రకారం ప్రతి సంస్థ తప్పనిసరిగా ఏడాదికోసారి ఏజీఎం నిర్వహించాల్సిందే. అది కూడా ఒక ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు నిర్ణీత కాల వ్యవధిలో ఏజీఎం నిర్వహించాలి. సాధారణ పరిస్తితుల్లో ఇలాంటి వాటిని రద్దు చేయరు. అత్యవర పరిస్థితుల్లో మాత్రమే నిబంధలకు అనుగుణంగా ఏజీఎం రద్దు చేయాలి. ఈ రోజు జరగాల్సింది కంపెనీ 108వ ఏజీఎం. మళ్లీ ఏజీఎం ఎప్పుడు నిర్వహించాలి అనే అంశంపై బోర్డు సభ్యులతో చైర్మన్ సంప్రదించిన తర్వాత నిర్ణయిస్తారు. టాటా సన్స్ సంస్థలో సర్ రతన్ టాటా ట్రస్ట్ (ఎస్ఆర్‌టీటీ)తోపాటు, సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ వాటాలు కలిపి 51.5 శాతం ఉన్నాయి. అంటే, సంస్థలో ఈ రెండు ట్రస్టులే అత్యధిక వాటా కలిగి ఉన్నాయి. ఈ రెండు ట్రస్టులు కలిసి ఉమ్మడిగా సభ్యుడిని నామినేట్ చేసిన తర్వాత కోరమ్ జరిగే అవకాశం ఉంది.

## భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్..

# సెన్సెక్స్ 492 పాయింట్లు పతనం

భారత స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీగా పతనమయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 492 పాయింట్లు పతనం కాగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 132 పాయింట్లు నష్టపోయింది. ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 77,418.97 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజులో 77,575.21 పాయింట్ల గరిష్ట స్థాయికి, 77,234.3గీ పాయింట్ల కనిష్ట స్థాయికి చేరింది. చివరకు 492.70 పాయింట్ల (0.గీ3 %) నష్టంతో 77,235.4గీ వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 కూడా 132.75 పాయింట్లు (0.55%) నష్టపోయి 24,154.90 వద్ద ముగిసింది. బీఎస్ఈ సెన్సెక్స్ వరుసగా గత ఐదు సెషన్లు నష్టపోగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ వరుసగా ఆరు సెషన్ల నుంచి నష్టాలు పొందుతోంది. బీఎస్ఈ సెన్సెక్స్‌లో యాక్సిస్ బ్యాంక్ అత్యధికంగా 0.89% లాభపడింది. పవర్ గ్రిడ్ 0.గీగీ%, ఎంఅండ్ఎం అడ్వాన్సుడ్ 0.47%, బజాజ్ ఫైనాన్స్ 0.27%, లార్సెన్ అండ్ టర్బో 0.15%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.88% లాభపడ్డాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్టీపీసీ షేర్లు కూడా లాభాల్లోనే ముగిశాయి. మరోవైపు ఏసియన్ పెయింట్స్ అత్యధికంగా 2.40% నష్టపోగా, హెచ్‌సీఎల్ టెక్ సంస్థ 1.93%, భారతీ ఎయిర్‌టెల్ 1.75%, ఇన్ఫోసిస్ 2.02%, టీసీఎస్ 1.47%, హిందుస్తాన్ యునీలివర్ 1.41% నష్టపోయాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 91 డాలర్లుగా ఉంది. అలాగే, డబ్ల్యూటీఐ క్రూడాయిల్ బ్యారెల్ ధర 84.99 డాలర్లుగా ఉంది. బ్రెంట్ క్రూడాయిల్ ధర 9 % పెరిగింది. రూపాయి విలువ స్వల్పంగా తగ్గి ఫ్లాట్‌గా ముగిసింది. డాలర్‌తో 7



పైసలు తగ్గిన రూపాయి 95.గీ8 వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,394.72 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఐటీ, రియాల్టీ, బ్యాంక్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురికావడం, పశ్చిమాసియా యుద్ధం కారణంగా నెలకొన్ని అంతర్జాతీయ పరిణామాలు, చమురు ధరల పెరుగదల వంటివి మార్కెట్ పతనానికి కారణాలుగా విశ్లేషకులు చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. జపాన్ నిక్కీ 2.5 శాతం నష్టాలు పొందగా, దక్షిణ కొరియా కోస్పి లాభాల్లో ముగిసింది. యురోపియన్ మార్కెట్లు నష్టాల్లోనే కొనసాగుతున్నాయి.

# మెటాపై చైల్డ్ సోషల్ మీడియా అడిక్షన్ కేసు!

కాలిఫోర్నియా, కొలరాడో, కెంటుకీ, న్యూజెర్సీ రాష్ట్రాలు మెటా సంస్థపై ఓక్‌లాండ్‌లోని ఫెడరల్ కోర్టులో దాఖలు చేసిన కేసులో విచారణ ప్రారంభమైంది. ఈ విచారణలో రాష్ట్రాల తరఫు న్యాయవాదులు దాదాపు 200 బిలియన్ డాలర్ల పరిహారం కోరుతున్నట్లు తెలిపారు. అయితే.. మెటా దాఖలు చేసిన కోర్టు పత్రంలో రాష్ట్రాలు 1.4 ట్రిలియన్ డాలర్ల వరకు జరిమానా కోరుతున్నాయని, దీన్ని అసాధారణమైనదిగా అభివర్ణించింది. 2023లో బహుళ రాష్ట్రాల విచారణ అనంతరం నలుగురు అటార్నీ జనరల్స్ ఈ కేసును దాఖలు చేశారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో యువ వినియోగదారులను ఎక్కువసేపు కట్టిపడేసేందుకు ఇన్ఫినిట్ స్క్రోల్, ఆటోప్లే, లైక్స్ వంటి మానసికంగా ప్రభావితం చేసే ఫీచర్లను మెటా రూపొందించిందని ఆరోపణలు ఉన్నాయి. ఈ యాప్‌లు యువతలో ఆందోళన, డిప్రెషన్, ఆత్మహత్య ఆలోచనలు పెంచుతున్నాయని తెలిసినప్పటికీ, వాటిని సురక్షితమైనవిగా చిత్రీకరించి మెటా వినియోగదారులను తప్పుదోవ పట్టించిందని రాష్ట్రాలు వాదిస్తున్నాయి. అదనంగా.. 13



ఏళ్లలోపు వినియోగదారుల డేటాను అనుమతి లేకుండా సేకరించి చిన్నారుల ఆన్‌లైన్ గోప్యతా చట్టాన్ని ఉల్లంఘించిందని కూడా ఆరోపిస్తున్నారు. మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్, ఇన్‌స్టాగ్రామ్ చీఫ్ ఆడమ్ మొసేరీ ఈ విచారణలో సాక్ష్యం చెప్పనున్నారు. ఇప్పటికే లాస్ ఏంజిల్స్, న్యూమెక్సికోలలో జరిగిన ఇలాంటి కేసుల్లో జ్యూరీలు మెటాకు వ్యతిరేకంగా తీర్పులు ఇచ్చాయి, వాటిపై మెటా అప్పీలు చేయనుంది. సోషల్ మీడియా అడిక్షన్ అనేది అధికారికంగా గుర్తించిన మానసిక వ్యాధి కాదని మెటా వాదిస్తోంది. ఈ కేసును పరిశ్రమ నిపుణులు సోషల్ మీడియా రంగానికి 'బిగ్ టొబాకో' తరహా కీలక ఘట్టంగా అభివర్ణిస్తున్నారు. ఈ విచారణ సుమారు ఆరు వారాల పాటు కొనసాగనుంది.

## ధనంజయ, దినుష పోరాటం..

# పట్టు బిగిస్తున్న టీమిండియా

శ్రీలంకతో గాలె టెస్టులో టీమిండియా పట్టు బిగించింది. భారత బౌలర్ల విజృంభణతో లంక బ్యాటర్లు ఆరంభంలోనే పెవిలియన్‌కు వరుస కట్టారు. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో శ్రీలంక కేవలం 47 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోవడం బ్యాటర్ల వైఫల్యానికి నిదర్శనం.

**తొలి ఇన్నింగ్స్ ఇలా**

ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2025-27 సీజన్‌లో భాగంగా టీమిండియా రెండు మ్యాచ్‌లు ఆడేందుకు శ్రీలంకకు వెళ్లింది. ఈ క్రమంలో ఇరుజట్ల మధ్య గాలె స్టేడియంలో శనివారం తొలి టెస్టు మొదలైంది. టాస్ గెలిచిన టీమిండియా తొలుత బ్యాటింగ్‌కు దిగి.. తొలి ఇన్నింగ్స్‌లో 4గీ2 పరుగులకు ఆలౌట్ అయింది. టాపార్డర్‌లో ఓపెనర్ కేఎల్ రాహుల్ అర్ధ శతకం (82) సాధించగా.. వన్‌డౌన్ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ భారీ సెంచరీతో కదం తొక్కాడు. మొత్తంగా 230 బంతులు ఎదుర్కొని 1గీ7 పరుగులు సాధించాడు. వీరితో పాటు ఆరో నంబర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ హాఫ్ సెంచరీ (51)తో రాణించాడు.

**లంకను కట్టడి చేసిన భారత బౌలర్లు**

లంక బౌలర్లలో స్పిన్నర్లలో ప్రభాత్ జయసూర్య నాలుగు వికెట్లతో విజృంభించగా.. కేశారా నువాంత మూడు వికెట్లు పడగొట్టాడు. పేసర్ అసిత ఫెర్నాండో రెండు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం శ్రీలంక బ్యాటింగ్‌కు దిగి 284 పరుగులకు ఆలౌట్ అయింది. భారత స్పిన్నర్లలో మానవ్ సుతార్ నాలుగు వికెట్లతో చెలరేగగా.. రవీంద్ర జడేజా మూడు, కుల్దీప్ యాదవ్ ఒక వికెట్ దక్కించుకున్నారు. పేసర్లు మహ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణ చెరో వికెట్ కూల్చారు. దీనిని బట్టి ఓవరాల్‌గా ఇరుజట్ల తొలి ఇన్నింగ్స్‌లో స్పిన్నర్ల హవా కొనసాగిందని చెప్పవచ్చు. అయితే, రెండో ఇన్నింగ్స్‌కు వచ్చే సరికి కథ మారిపోయింది. ఈసారి పిచ్ కాస్త పేస్ బౌలర్లకు అనుకూలించగా.. లంక పేసర్లు అసిత ఫెర్నాండో, లాహిరు కుమార టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్‌ను కుదేలు చేశారు. అసిత నాలుగు వికెట్లు తీయగా.. కుమార రెండు వికెట్లు దక్కించుకున్నాడు. ప్రభాత్ జయసూర్యకు మూడు వికెట్లు దక్కగా.. కేశారా ఒక వికెట్ తీశాడు.

**ఈసారి 193 పరుగులకే ఆలౌట్**

లంక బౌలర్ల విజృంభణ కారణంగా రెండో ఇన్నింగ్స్‌లో 193




పరుగులకే కుప్పకూలింది. అయితే, తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 178 పరుగులు కలుపుకొని.. శ్రీలంకకు 372 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 47 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. పేసర్ సిరాజ్ నిశాన్ మధుష్క (గీ)ను అవుట్ చేయగా భారత్ వికెట్ల ఖాతా తెరిచింది. స్పిన్నర్ మానవ్ సుతార్ పసిందు సూరియబండారా (0), లాహిరు ఉదార (1గీ)లను పెవిలియన్‌కు పంపగా.. మరో పేసర్ ప్రసిద్ కృష్ణ కమిందు మెండిస్ (2)ను అవుట్ చేశాడు.



**పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన వేళ**

ఇలా లంక పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన వేళ కెప్టెన్ ధనంజయ డి సిల్వతో కలిసి సొనాల్ దినుష ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నాడు. మంగళవారం నాటి నాలుగో రోజు ఆట ముగిసే సరికి ధనంజయ 31, దినుష 25 పరుగులతో క్రీజులో నిలిచారు. ఫలితంగా లంక ఆట పూర్తయ్యేసరికి 34 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 84 పరుగులు చేయగలిగింది. ఇక బుధవారం ఆటకు చివరి రోజు కాగా.. లంక విజయానికి 288 పరుగుల దూరంలో ఉండగా.. చేతిలో ఆరు వికెట్లు ఉన్నాయి. కాగా బుధవారం వీలైనంత త్వరగా భారత బౌలర్లు ధనంజయ, దినుష జోడీని విడదీయాల్సి ఉంటుంది. దినుష తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ (100) చేసిన సంగతి తెలిసిందే.

## స్పోర్ట్స్

### ఆట అదిరినా.. 'విలియమ్స్ సిస్టర్స్'కు విజయం దక్కలే..!



ఒకప్పుడు మహిళల టెన్నిస్‌ను ఏలిన 'విలియమ్స్ సిస్టర్స్' మునపటి జోరు చూపలేకపోయారు. కోర్టులోకి దిగారంటే తిరుగులేని ఆధిపత్యంతో రికార్డులు బద్ధలుకొట్టే సెరీనా విలియమ్స్, వీనస్ విలియమ్స్‌లు నాలుగేళ్ల తర్వాత డబుల్స్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లోనే ఓటమి చవిచూశారు. వైల్డ్ కార్డ్ ఎంట్రీతో సిన్సినాటి ఓపెన్‌లో బరిలోకి దిగిన ఈ అమెరికా నల్లకలువలు ప్రేక్షకులను అలరించారు. కానీ, మ్యాచ్ మాత్రం గెలవలేకపోయారు. గ్రాండ్‌స్లామ్, ఏటీపీ టూర్.. టోర్నీ ఏదైనా టైటిల్ మాదే అన్నట్టు చెలరేగి ఆడే విలియన్స్ సిస్టర్స్ మరోసారి జంటగా అభిమానులను అలరించారు. నాలుగేళ్ల విరామం తర్వాత వీరిద్దరూ మహిళల డబుల్స్‌లో తొలిసారి ఆడారు. సిన్సినాటి ఓపెన్‌లో వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇచ్చిన వీరు అనూహ్యంగా మర్టా కొస్ట్యుక్ -- పీటన్ స్టీర్న్స్ చేతిలో ఓటమి పాలయ్యారు . కోర్టులో తమదైన షాట్లతో ఆకట్టుకున్న ఈ వెటరన్ సిస్టర్స్ తొలి సెట్ కోల్పోయినా రెండో సెట్‌లో పుంజుకున్నారు. కానీ, నిర్ణయాత్మక మూడో సెట్‌లో మాత్రం తేలిపోయారు. మొత్తంగా మూడు సెట్ల పోరులో 2-గీ, గీ-1, 8-10తో మ్యాచ్ చేజార్చుకుని టోర్నీ నుంచి నిష్క్రమించారీ లెజెండ్స్. ఇదివరకూ 2022 యూఎస్ ఓపెన్‌లో చివరిసారిగా కలిసి ఆడారీ వెటరన్ సిస్టర్స్. గతంలో డబుల్స్ జోడీగా వీరు 14 టైటిళ్లు సాధించిన విషయం తెలిసిందే.

# సీఎం విజయ్ తనయుడి 'సిగ్మా' రిలీజ్ డేట్ ఫిక్స్..
# గాంధీ జయంతిన రాబోతున్న సందీప్ కిషన్!

కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ హీస్ట్ డ్రామా 'సిగ్మా'. టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక విడుదల తేదీని ప్రకటించారు. గాంధీ జయంతి కానుకగా 202గీ అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన సరికొత్త పోస్టర్‌లో సందీప్ కిషన్ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత ఇంటెన్స్ లుక్‌లో కనికట్టు చేస్తున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన టాలెంటెడ్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తుండగా, నూతన దర్శకుడి ప్రతిభకు తగ్గట్టుగా భారీ తారాగణం ఈ సినిమాలో భాగమైంది. ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు రాజు సుందరం, వర్సటైల్ యాక్టర్ సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు దాసన్, యోగ్ జాపీ, షీలా రాజ్‌కుమార్ మరియు కిరణ్ కొండ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. థమన్ ఈ సినిమాకు అదిరిపోయే సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు మరియు ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ఖరారు కావడంతో, రాబోయే రోజుల్లో టీజర్, పాటలతో పాటు ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.







# రజినీకాంత్ 'జైలర్ 2' నుంచి
# అదిరిపోయే అప్‌డేట్..
## ఫస్ట్ సింగిల్ వచ్చేది అప్పుడే!

సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా, నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సీక్వెల్ చిత్రం 'జైలర్ 2' నుంచి మేకర్స్ తాజాగా ఒక అదిరిపోయే అప్‌డేట్‌ను విడుదల చేశారు. ది ఫీస్ట్ ఈజ్ రెడీ అంటూ చిత్ర బృందం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ అనౌన్స్‌మెంట్‌ను పంచుకుంది. ఈ ఫస్ట్ సింగిల్ ఆగస్టు 21వ తేదీన విడుదల కానున్నట్లు చిత్రబృందం తెలిపింది. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంపై అభిమానుల్లో విపరీతమైన క్రేజ్ ఉంది. మొదటి భాగం మ్యూజిక్‌తో ఏ విధంగా థియేటర్లను షేక్ చేసిందో, ఇప్పుడు ఈ సీక్వెల్ సాంగ్ తో కూడా అదే రేంజ్ మ్యాజిక్ రిపీట్ చేయడానికి అనిరుధ్ సిద్ధమవుతున్నారు. మరోవైపు ఈ సినిమాను అక్టోబర్ 15వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఈ చిత్రంలో రజినీకాంత్‌తో పాటు పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ, నిర్మల్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.




# ఎన్టీఆర్-త్రివిక్రమ్ సినిమాపై
# హాట్ టాపిక్..
## ట్రెండింగ్‌లో ఆ రెండు టైటిల్స్!

టాలీవుడ్ మోస్ట్ అంటెసిపేటెడ్ కాంబినేషన్లలో ఒకటైన యంగ్ టైగర్ ఎన్టీఆర్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రాబోయే సినిమాకు సంబంధించి ఇండస్ట్రీలో ఒక ఆసక్తికర వార్త తెగ చక్కర్లు కొడుతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి ప్రముఖ నిర్మాణ సంస్థ 'ఎన్టీఆర్ ఆర్ట్స్' తాజాగా రెండు సూపర్ టైటిల్స్‌ను అధికారికంగా రిజిస్టర్ చేయించినట్లు తెలుస్తోంది. తారక్ త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా, తాజాగా బయటకు వచ్చిన ఈ టైటిల్స్ మరింత హైప్‌ను సృష్టిస్తున్నాయి. ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ 'దేవసేనాపతి' మరియు 'గాడ్ ఆఫ్ వార్' అనే రెండు టైటిల్స్‌ను ట్రేడ్ వర్గాల్లో రిజిస్టర్ చేయించినట్లు సమాచారం. ఈ రెండు టైటిల్స్ వింటుంటేనే ఇదొక పౌరాణిక టచ్ ఉన్న హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందనే ఊహాగానాలు ఫ్యాన్స్ మధ్య జోరుగా సాగుతున్నాయి. ఈ చిత్రానికి సంబంధించి త్వరలోనే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఎన్టీఆర్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలవనున్న ఈ ప్రాజెక్ట్‌కు ఏ టైటిల్ ఫిక్స్ చేస్తారనేది ప్రస్తుతం సర్వత్రా ఉత్కంఠ రేకెత్తిస్తోంది.

# తెలంగాణ నేపథ్యంలో తెరకెక్కిన 'పల్లెబురుసు'పై
# బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ప్రశంసలు!



తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన 'పల్లెబురుసు' చిత్రం విడుదలై ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకుంటున్న సంగతి తెలిసిందే. టాలీవుడ్‌లో ఇటీవల కాలంలో వస్తున్న భారీ యాక్షన్ సినిమాలకు పూర్తి భిన్నంగా, అత్యంత సహజమైన కుటుంబ కథాంశంతో రూపొందిన ఈ సినిమాపై ఇప్పటికే పలువురు ప్రశంసలు కురిపించారు. అయితే తాజాగా ఈ సినిమా చూసిన ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ప్రశంసల వర్షం కురిపించారు. లెటర్‌బాక్స్ వేదికగా ఈ చిత్రానికి ఏడుకి ఐదు స్టార్ల రేటింగ్ ఇస్తూ ఆయన ఒక అద్భుతమైన రివ్యూను పంచుకున్నారు. ప్రస్తుత చిత్ర పరిశ్రమలో రొటీన్ యాక్షన్ సినిమాల జోరు ఎక్కువగా ఉందని, వాటి మధ్య ఈ 'పల్లెబురుసు' ఒక సరికొత్త రిఫ్రెషింగ్ మార్పులా కనిపిస్తోందని అనురాగ్ కశ్యప్ కొనియాడారు. సినిమా చాలా సింపుల్‌గా, ఆకట్టుకునేలా సాగుతూ ప్రేక్షకులను నిత్యం నవ్విస్తుందని ఆయన తెలిపారు. 'కేరాఫ్ కంచరపాలెం', 'రావు బహదూర్' చిత్రాల దర్శకుడు వెంకటేష్ మహా ఎంట్రీని గుర్తుచేస్తూ, నూతన దర్శకుడు ఉదయ్ చౌహాన్ భవిష్యత్తులో మరిన్ని గొప్ప సినిమాలు తీయగలడంటూ ఆయనను ప్రత్యేకంగా ప్రశంసించారు. కేవలం లెటర్‌బాక్స్‌లోనే కాకుండా ఇన్‌స్టాగ్రామ్‌లోనూ ఈ సినిమాపై తన అభిప్రాయాలను పంచుకుంటూ, ఇదొక అరుదైన డ్రామెడీ (డ్రామా ం కామెడీ) చిత్రమని అభివర్ణించారు. సాధారణ కుటుంబంలో తండ్రీకొడుకుల మధ్య జరిగే ఒక చిన్న వివాదం చుట్టూ ఈ కథ నడుస్తుంది. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో కొడుకు తనకు టూత్ బ్రష్ కొనివ్వలేదంటూ ఒక వృద్ధ తండ్రి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించడం కథాంశం. ఈ చిన్న ఫిర్యాదు కాస్తా క్రమంగా పెద్ద లీగల్ మరియు భావోద్వేగ యుద్ధంగా మారి, వారి మధ్య సంవత్సరాలుగా దాగి ఉన్న ఏకాంతం, మనస్పర్థలను ఎలా బయటపెట్టిందనేదే ఈ చిత్ర కథాసారాంశం. ఈ చిత్రంలో సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ తండ్రీకొడుకులుగా ప్రధాన పాత్రల్లో నటించి అద్భుతమైన అభినయాన్ని ప్రదర్శించారు. ఉదయ్ చౌహాన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి అన్నపూర్ణ స్టూడియోస్ మరియు ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మాణం వహించగా, నాగార్జున ఈ ప్రాజెక్ట్‌ను సమర్పించారు. స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్టు 14న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. శ్మశానవాటికలో ఏడుస్తున్న ఒక వృద్ధుడిని చూసి తనకు వచ్చిన ఆలోచన నుంచే ఈ కథను రూపొందించినట్లు దర్శకుడు ఉదయ్ చౌహాన్ గతంలో వెల్లడించారు.

# రవితేజ 'ఇరుముడి'
# సెన్సార్ పూర్తి..
# రన్‌టైం ఎంతంటే!

టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా సంచలన చిత్రం 'ఇరుముడి' థియేట్రికల్ విడుదలకు సర్వం సిద్ధం చేసుకుంది. దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా 'యు/ఎ' సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. అలాగే సినిమా రన్‌టైమ్‌ను రెండు గంటల ఇరవై ఐదు నిమిషాల నిడివి తో లాక్ చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో రవితేజ పూర్తి భిన్నమైన, సరికొత్త పాత్రలో కనిపించను న్నారు. మధ్యతరగతి కుటుంబసభ్యుడిగా, కూతురు పాత్రలో నటించిన బేబీ నక్షత్రాతో ఆయన సాగే అనుబంధం ఈ సినిమాకు ప్రధాన భావోద్వేగ బలంగా నిలవనుంది. ముఖ్యంగా ఆల్కహాల్ వ్యసనంతో పోరాడే ఒక మధ్యతరగతి వ్యక్తి జీవితం, భవిష్యత్తులో అయ్యప్ప దీక్షను స్వీకరించి మాల ధరించిన తర్వాత ఎలాంటి ఆధ్యాత్మిక పరివర్తన చెందుతుందనే కోణంలో ఈ కథ సాగనుంది. గ్రామీణ వాతావరణం, సహజసిద్ధమైన లొకేషన్లు మరియు ఏజెన్సీ ప్రాంతాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని, ఇది ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచుతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయి కుమార్, అజయ్ ఘోష్, స్వసిక తదితరులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆగస్టు 22వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది




This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com